www.vishalabharati.com
epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
01.10.2024
సంపుటి:2 సంచిక:338

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

# ముందు హైడ్రా ఆఫీసు కూల్చేయండి



- నాలా మీదే ఈ కార్యాలయం కట్టారు
- ఎలక్షన్ కమిషన్, మహిళా కమిషన్ ఆఫీసులు కూడా ఇక్కడే ఉన్నాయి
- మూసీ సుందరీకరణకు ఎంత ఖర్చు పెడతారు?
- ఈ ప్రాజెక్టుతో ఒక్క ఎకరాకైనా సాగు నీరు అందుతుందా?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

నిబంధనల ప్రకారం అక్రమ నిర్మాణాలను కూల్చాల్సి వస్తే, మొదట కూల్చాల్సింది హైడ్రా కమిషనర్ కార్యాలయాన్ని అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. హుస్సేన్ సాగర్ పక్కన ఉన్న బుద్ధ భవన్ లో హైడ్రా ఉన్న ఆఫీసును నాలా మీద కట్టారని, అలాంటప్పుడు కూల్చివేతలు ఇక్కడి నుంచే

..మిగతా 2 లో

# ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్



- మంత్రివర్గ విస్తరణపైనే ప్రధాన చర్చ
- దసరాలోపే కొత్త మంత్రుల ప్రమాణం
- ఢిల్లీలో కొందరు సీనియర్ నేతల లాబియింగ్స్
- ఇప్పటికే భట్టి విక్రమార్క, ఉత్తమ్ సుదీర్ఘ మంతనాలు
- ఇప్పటికే అనేక సార్లు వాయిదా..
- ఈ సారి కూడా పోస్ట్ పోన్ అవుతుందా?
- లేదంటే శుభవార్త వినిపిస్తారా?

> తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి ఢిల్లీ కి బయల్దేరారు. సోమవారం రాత్రి 8.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఆయన ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఇటీవల జమ్ముకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో అస్వస్థతకు గురైన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ను మంగళవారం పరామర్శించనున్నారు. ఆ తర్వాత ఢిల్లీలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం కానున్నారు.

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో చర్చించనున్నారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల భర్తీపై మాట్లాడనున్నారు. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీలో టీపీసీసీ కార్యవర్గం పైన చర్చించనున్నారు. మంత్రివర్గ విస్తరణలో ఈసారి ఎవరికి అవకాశం దక్కుతుందో అని నేతల్లో ఉత్కంఠ నెలకొంది. దసరాలోపు మంత్రివర్గాన్ని చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నారని సమాచారం. అంతే కాకుండా హైడ్రా, మూసీ ప్రక్షాళన తదితర అంశాలపై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు ఎదురవుతున్న నేపథ్యంలో, ఈ నిర్ణయం తీసుకోవడం వెనక ఉన్న కారణాలను ఆయన అధిష్ఠానానికి వివరించే అవకాశం ఉంది. మోదీని గద్దె దించి తీరుతానన్న మల్లికార్జున ఖర్గే

ఇది ఇలా ఉంటే కథువా బహిరంగ సభలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతుండగా ఉన్నట్టుండి అదుపు తప్పి కింద పడబోయారు. పక్కనే ఉన్న నేతలు ఖర్గేను కిందపడకుండా గట్టిగా పట్టుకున్నారు. కాసిన్ని నీళ్లు తాగిన ఖర్గే.. మళ్లీ ప్రసంగం కొనసాగించారు. ఆయన అస్వస్థతకు గురికాక ముందే తనకు 83ఏళ్లు అయినప్పటికీ.. ఫిట్ గా ఉన్నాని అన్నారు. మోడీ సర్కార్‌ను గద్దె దించే వరకు తాను బతికే ఉంటానన్నారు. జమ్ము కాశ్మీర్ కు మళ్లీ రాష్ట్ర హోదా వచ్చే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందన్నారు.

**మంత్రి వర్గ విస్తరణ**

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సుమారు పది నెలలు అవుతుంది. ఇంకా పూర్తి స్థాయి మంత్రివర్గ విస్తరణ కాలేదు. గత నాలుగు

..మిగతా 2 లో



# హైడ్రా టార్గెట్ భూ బకాసురులే

- గత పదేళ్లలో 1500 చెరువులు కబ్జా అయ్యాయి
- ఎక్కువశాతం చెరువులను కబ్జా చేసింది బీఆర్ఎస్ నేతలే
- మూసీ ప్రక్షాళన అన్ని పార్టీల అజెండాలో ఉంది
- ఒక్క పేదవాడి ఇల్లు కూల్చలేదు
- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై చర్యలు
- పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

మూసీ పరివాహకంలో ఇప్పటివరకు ఏ ఒక్క పేదవాడి ఇల్లు కూల్చలేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. అరగంట వాన పడితే హైదరాబాద్ పరిస్థితి

..మిగతా 2 లో



# తెలంగాణ భవన్ పై దాడి

- బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్.. సురేఖపై కామెంట్లతో గరం గరం
- రణరంగంగా మారిన తెలంగాణ భవన్ ప్రాంగణం
- పోలీసులు పట్టించుకోలేదంటు బీఆర్ఎస్ ఆరోపణ
- సర్దిచెప్పిన పోలీసులు

..మిగతా 2 లో



# మహిళా మంత్రిని అవమానిస్తారా?

- ఇదేనా మీ సంస్కారం
- కేటీఆర్ సమాధానం చెప్పు
- సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్టు తిట్టిస్తారా?
- అసభ్యంగా ట్రోల్స్ చేస్తారా?
- కవితను ఇలాగే ట్రోల్స్ చేస్తే ఊరుకుంటారా?
- మెడలో నూలుదండ వేస్తే చిల్లర కామెంట్లు పెడతారా?
- మంత్రి కొండా సురేఖ
- మీడియా సమావేశంలోనే కంటతడి

..మిగతా 2 లో



# రుణమాఫీ వివరాలను ప్రజాపోర్టల్‌లో పెట్టాలి

## హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదు

- కాంగ్రెస్ వచ్చాక వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్య
- రైతు హామీల సాధన కోసం బీజేపీ 24 గంటల దీక్ష
- కాంగ్రెస్ మెడలు వంచుతాం
- బీజేపి నేతలు ఎంపీలు ఈటల రాజేందర్, డీకే.అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, గోడెం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి

విశాలభారతి,స్టేట్ బ్యూరో:
రైతు రుణమాఫీ వివరాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పోర్టల్‌లో పెట్టాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. రైతు హామీల సాధన కోసం బీజేపీ ప్రజా ప్రతినిధులు హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వద్ద ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు 24 గంటల దీక్ష చేపట్టారు. ఇందిరాపార్క్ ధర్నాచౌక్లో రైతు హామీల సాధన దీక్ష పేరుతో బీజేపీ ప్రజా

..మిగతా 2 లో

# దసరాకు 6,100 ప్రత్యేక సర్వీసులు

- ఏపీ ఎస్ఆర్టీసీ ప్రకటన
- ఏసీ బస్సుల్లో టికెట్ పై రాయితీ

..మిగతా 3 లో

పెద్దకర్మ



కీ॥శే॥ శ్రీ అప్పిడి సోమిరెడ్డి గారు
మరణం: 21-09-2024

మాకు ఎంతో స్ఫూర్తినిచ్చిన ఆదర్శమూర్తి... మమ్మల్ని ఎంతగానో ప్రేమించిన అమృతమూర్తి...
మా వెన్నంటే ఉండి మమ్మల్ని నడిపించి మా నుండి భౌతికంగా దూరమైనను
మీ జ్ఞాపకాలు మా హృదయాలలో పదిలం...
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని మనసారా కోరుకుంటూ... భగవంతుని ప్రార్థిస్తున్నాం...

భార్య: అప్పిడి కమలమ్మ


కుమారులు-కోడళ్ళు:
అప్పిడి యాదవ రెడ్డి - వసంత
అప్పిడి ఉపేందర్ రెడ్డి - సునిత
అప్పిడి చంద్రారెడ్డి - పద్మ

మరియు మనుమళ్లు, మనుమరాళ్ళు

కార్యస్థలము: నేడు మా స్వగృహము నందు కామారెడ్డి గ్రా॥, దేవరుప్పల మం॥, జనగాం జిల్లా. సెల్: 9848090109, 9391126374,9848044299

# రంగనాథ్.. కాస్త తగ్గు

- హైకోర్టు ఆదేశాలంటే లెక్క లేదా?
- ఆదివారం మాత్రమే కూల్చివేతలు ఎందుకు?
- హైకోర్టు ఆదేశాలు ఉన్నా నిర్ణయాలు వెనక్కి తీసుకోరా?
- సాయంత్రం నోటీసులిచ్చి..పొద్దున్నే కూలిస్తామంటే ఎలా?
- హైకోర్టు ప్రశ్నల వర్షం



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

హైడ్రా అధికారులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కొన్ని రోజులుగా దూకుడుగా వెళ్తున్న హైడ్రాపై కొందరు బాధితులు కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిష్ విచారించిన హైకోర్టు అమీన్‌పూర్ తహశిల్దార్, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై ఆగ్రహం

..మిగతా 2 లో



# మూసీ సంగతి మాకు తెల్వదు

- అక్కడ మేము కూల్చివేతలు చేపట్టడం లేదు
- నిర్వాసితులను ఎక్కడికీ తరలించడం లేదు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

..మిగతా 2 లో



# తెలంగాణ భవన్ పై దాడి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
హైడ్రా కూల్చివేతల కారణంగా జరుగుతున్న రాజకీయంలో నేతల మధ్య రాజకీయ వాగ్వాదాలు శృతి మించి పోతున్నాయి. ఫలితంగా దాడులకు సైతం దిగితున్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ లో ఉన్న తెలంగాణ భవన్ పైకి కాంగ్రెస్ కార్యకర్తలు దండెత్తినట్లుగా వచ్చారు. ఒక్క సారిగా వందల మంది రావడంతో పోలీసులు ఉలిక్కి పడ్డారు. విషయం తెలిసి పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా రావడంతో.. తెలంగాణ భవన్ ఎదురట రణరంగం అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. బీఆర్ఎస్ సోషల్ మీడియాకు చెందిన వారు మంత్రి కొండు సురేఖపై నీచంగా కామెంట్లు పెట్టారని.. పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ వరంగల్ నుంచి వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలు ఈ ముట్టడికి ప్రయత్నించినట్లుగా తెలుస్తోంది.

కాంగ్రెస్ కార్యకర్తలను అదుపు చేయడానికి పోలీసులు సరైన సంఖ్యలో లేకపోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలే వారితో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ ఆందోళనల్లో మహిళా నేతలు,కార్యకర్తలు ఉండటంతో పరిస్తితి ఎటు వైపు వెళ్తుందోనని కంగారు పడ్డారు. ఈ వివాదం కారణంగా అత్యంత బిజీగా ఉండే జూబ్లిహిల్స్ కేబీఆర్ పార్క్ రోడ్ లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. పోలీసులు కాసేపటికి అందర్నీ పంపించివేశారు. ఓ వైపు హైడ్రా విషయంలో హైకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలో ఇలా తెలంగాణ భవన్‌పైకి కాంగ్రెస్ కార్యకర్తల్ని ఉసిగొల్పడం వెనుక రాజకీయ కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలతో పాటు ఆ పార్టీ సోషల్ మీడియా విభాగం, టీ న్యూస్ చానల్ కార్యాలయం కూడా ఉంది. చానల్ ఆ భవనం నుంచి ప్రసారమవుతుంది. కాంగ్రెస్ కార్యకర్తలు తెలంగాణ భవన్ లోపలికి వరకూ వెళ్లి ఉంటే పెద్ద సమస్య అయ్యేదని అంచనా వేస్తున్నారు. కాసేపటికి పరిస్థితి సద్దుమణిగింది. ఇరవైపులా దాడుల వరకూ వెళ్లకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ భవన్ మీదకు వచ్చిన కాంగ్రెస్ కార్యకర్తలను చితకబాదామని రేవంత్ రెడ్డికీ అదే పరిస్థితి వస్తుందని బీఆర్ఎస్ హెచ్చరించింది.

# మహిళా మంత్రిని అవమానిస్తారా?



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, రాష్ట్ర మంత్రి మంత్రి కొండా సురేఖ మీడియా సమావేశంలోనే కన్నీళ్లు పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్‌పై ఆమె స్పందించారు. సోమవారం గాంధీ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఒక మహిళా మంత్రి ఫోటోలను అసభ్యకర రీతిలో పోస్ట్ చేయడాన్ని ఆమె ఖండించారు. ఒక మహిళను అవమానిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా శ్రేణులు దారుణమైన పోస్టులు పెట్టారని ఆరోపించారు. అధికారం పోయిందన్న బాధలో బీఆర్ఎస్ నేతలు ఏం చేస్తున్నారో వారికే తెలియడం లేదని విమర్శించారు. ఆ పార్టీ మహిళా నాయకురాలు ఎమ్మెల్సీ కవిత పట్ల ఇలాంటి ట్రోలింగ్, కామెంట్లు చేస్తే ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. డబ్బులు ఇచ్చి మరీ ట్రోలింగ్ చేయిస్తున్నారని భావోద్వేగానికి లోనయ్యారు.

**అసలేమైంది అంటే**
ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో బీజేపీ నేత, మెదక్ ఎంపీ దుబ్బాక రఘునందన్ రావు.. మంత్రి కొండా సురేఖ మెడలో నూలు దండ వేశారు. రఘునందన్ రావు.. కొండా సురేఖ మెడలో నూలు దండ వేయడంపై బీఆర్ఎస్ నేతలు కొందరు సోషల్ మీడియాలో ట్రోల్స్ చేశారు. ఈ ఘటన పై ఇవాళ ఆమె గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. మెడలో నూలు దండ వేస్తే చిల్లర కామెంట్లు చేస్తారా అన్నారు.. సోషల్ మీడియా కామెంట్లతో నిన్నటి నుండి ఆవేదనతో ఉన్నా.. అన్నం కూడా తినలేదన్నారు. మహిళనని చూడకుండా పశువుల కంటే హీనంగా బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని ఆవేదన చెందారు

**ఎంతో బాధించింది**
ఈ ఘటన పట్ల తన మనస్సును ఎంతో కలిచి వేసిందని .. కొండా సురేఖ మీడియా సాక్షిగా కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతే కాకుండా.. తాను. అన్నం తినలేదని, నిద్రపోలేదన్నారు. అదే విధంగా ట్రోలింగ్ లపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "నీకు ఓ చెల్లి ఉంది కదా.. ఆమె జైలుకు వెళ్లినప్పుడు మేం ఇలాగే ట్రోల్ చేశామా" అని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్పై మండిపడ్డారు. మహిళలంటే కేటీఆర్ కు మొదటి నుంచి చులకని అని.. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనను ఇలాగే అగౌరపరిస్తే ఆ పార్టీ నుండి బయటకు వచ్చానని చెప్పుకొచ్చారు. కేటీఆర్ ఖబర్దార్ ఇకపై సోషల్ మీడియాలో పోస్టులు పెడితే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్పై సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేశామని.. ఇకపై ట్రోలింగ్ చేస్తే సహించేది లేదన్నారు. అన్ని పార్టీల వాళ్లు నన్ను అక్కా అని, నా భర్తను బావ అని పిలుస్తారన్నారు. ఏదో ఒక రోజు ప్రజలు తిరగబడుతారని, చేనేత కార్మికుల ఓట్లతో గెలిచి పద్మశాలి బిడ్డను ఇంత అవమనపరుస్తారా? అని బీఆర్ఎస్ పై మండిపడ్డారు.

**అందుకే మంత్రి పదవి ఇవ్వలేదు**
తనకు.. మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తుందనే కేసీఆర్ మహిళకు మంత్రి పదవి ఇవ్వలేదన్నాడు. రెండో సారి అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ లో భారీ మార్పులు వచ్చాయని, బీఆర్ఎస్ నాయకులు డబ్బు మధం ఎక్కి పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తున్నారన్నారు. కేటీఆర్, హరీశ్ ఇంటి ఆడవాళ్లపై ట్రోల్ చేస్తే ఎలా ఉంటుందని గట్టిగానే కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ భార్యకు.. తాను సూటిగా ఒక ప్రశ్నవేస్తున్నానని..ఈ ఫోటోలో తప్పు ఏముందో చెప్పాలన్నారు లేకపోతే.. కేసీఆర్ ను ఉరికి స్తామని కొండా సురేఖ ఫైర్ అయ్యారు. అసభ్య కరమైన పోస్టులపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. ఈ ట్రోలింగ్ పై రఘునందన్ రావు.. నాకు ఫోన్ చేసి అక్క క్షమించండి...మీరు నాకు పెద్ద అక్క లాంటి వాళ్లు అని అన్నారు..కేటీఆర్ నీకు సిగ్గు లజ్జ ఉందా.. చేనేత కళను నువ్వు అవమానించావంటూ మండిపడ్డారు. గతంలో సీతక్కను, పొన్నం ప్రభాకర్ ను, మేయర్ ను కూడా ట్రోల్ చేశారని గుర్తు చేశారు. ఇలాంటివి మళ్ళీ జరిగితే మా కార్యకర్తలు నీ బట్టలు విప్పించి కొడతారంటూ వార్నింగ్ ఇచ్చారు. తనపై ట్రోలింగ్ చేసిన వ్యక్తి.. డీపీ హరీశ్ రావు ఫోటో ఉంది కనుక హరీశ్ రావు, కేటీఆర్ క్షమాపణ చెప్పాలన్నారు.



# ముందు హైడ్రా ఆఫీసు కూల్చేయండి

**మొదటిపేజీ తరువాయి**
తెలంగాణ ప్రభుత్వం చేపట్టాలని సూచించారు. అదే బిల్డింగ్ లో ఎలక్షన్ కమిషనర్, మహిళా కమిషన్ ఉందన్నారు. పర్మిషన్లు ఇచ్చే జీహెచ్ఎంసీ బిల్డింగ్ సైతం నాలా మీద ఉందని, దమ్ముంటే జీహెచ్ఎంసీ భవనాన్ని కూల్చాలని డిమాండ్ చేశారు.

**సెక్రటేరియట్ కూడా కూల్చేస్తారా?**
కేసీఆర్ మార్క్, ఆయన ఆనవాళ్లు కనిపించకుండా చేయాలని అనుకుంటున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా సెక్రటేరియట్ వద్దకు రాగానే కేసీఆర్ పాటలు పెట్టడం, నినాదాలు చేయడంతో రేవంత్ రెడ్డికి ఇరిటేషన్ వచ్చింది. అందుకే కేసీఆర్ కట్టిన సెక్రటేరియట్ ను సైతం కూల్చివేస్తారేమో. ఓట్లు అడిగిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇప్పుడు ఎక్కడ ఉన్నారు. తెలంగాణ ప్రజలతో కలిసిపోయినట్లు మభ్యపెట్టారు. ఇప్పుడు హైడ్రా కూల్చివేతల బాధితుల సమస్యలు కనిపిస్తలేవా, బాధితుల ఆక్రందనలు వినిపిస్తలేవా అని కేటీఆర్ ప్రశ్నించారు.

**అప్పట్లో కాళేశ్వరం ప్రాజెక్టు ఖర్చుపై ఎన్నో విమర్శలు**
బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన ప్రతిష్టాత్మక కాళేశ్వరం ప్రాజెక్టుపై అనుమానాలు వ్యక్తం చేశారు. కాళేశ్వరం పై పెట్టుబడితో ఏం ప్రయోజనం ఉందని అడిగేవారు. ప్రపంచంలో అతిపెద్ద బహుళార్థ సాధక ప్రాజెక్టు అని గర్వంగా చెబుతున్నాం. ఒక పంటకు 40 లక్షల ఎకరాలకు, 2 పంటలకు 80 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తుంది. హైదరాబాద్ తో పాటు వేలాది పట్టణాలు, గ్రామాలకు మంచినీళ్లు అందించే ప్రాజెక్టు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు హైదరాబాద్ మీద పెట్టిన నీటి కుండలాంటిది. దాని ద్వారా తెలంగాణ వరి సాగులో నెంబర్ వన్ గా నిలిచింది. మూసీ ప్రాజెక్టు వల్ల ఒక్క ఎకరాకైనా సాగునీరు వస్తుందా, కొత్త ఆయకట్టు ద్వారా ఒక్క రైతుకైనా ప్రయోజనం కలుగుతుందా అని కేటీఆర్ ప్రశ్నించారు.

# రంగనాథ్.. కాస్త తగ్గు



**మొదటిపేజీ తరువాయి**
వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల మేరు వీళ్లిద్దరు కోర్టు విచారణకు హాజరయ్యారు. కోర్టుకు ఆహజరైన రంగనాథ్, అమీన్పూర్ తహశీల్దార్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది హైకోర్టు. ఆదివారం కూల్చివేతలు ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నించింది. గతంలో తాము ఇచ్చిన ఆదేశాల గురించి మీకు తెలుసా తెలియదా అని ప్రశ్నించింది. అసలు రూల్స్ గురించి తెలుసా అని నిలదీసింది. హైడ్రా అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది.

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డి పంచాయతీ శ్రీకృష్ణనగర్‌లో ఆసుపత్రి భవనం కూల్చివేత విషయంలో హైకోర్టులో పిటిషన్ వేసింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికి కూడా అధికారులు దూకుడుగా వ్యవహరించారని బాధితులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. సెప్టెంబర్ 21 సాయంత్రం నోటీసులు ఇచ్చిన అధికారులు 22వ తేదీ ఉదయాన్నే కూల్చివేతలు మొదలు పెట్టారని వివరించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు అమీన్‌పూర్ తహశీల్దార్, హైడ్రా కమిషనర్ హాజర్రై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు వీళ్లిద్దరూ ఇవాళ కోర్టు ముందు హాజరయ్యారు.

**రంగనాథ్ అత్యుత్సాహం వద్దు- హైడ్రా చీఫ్‌కు హైకోర్టు హెచ్చరిక**
రాజకీయ నేతలను, పై అధికారులను సంతృప్తి పరిచేందుకు అత్యుత్సాహంతో పనిచేయొద్దని తెలంగాణ హైకోర్టు సోమవారం వ్యాఖ్యానించింది. హైడ్రా కూల్చివేతలకు సంబంధించి ఆ సంస్థ చీఫ్ రంగనాథ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సెలవు దినాల్లో పనిచేయాల్సిన అవసరం ఏమొచ్చిందని, శని ఆదివారాల్లో కూల్చివేతలు చేపట్టడమేంటని నిలదీసింది. కరుడుగట్టిన నేరస్థుడిని ఉరితీసే ముందు కూడా చివరి కోరిక అడుగుతారని గుర్తుచేసింది. అలాంటిది ఇంటిని కూల్చే ముందు యజమానికి చివరి అవకాశం ఏమైనా ఇచ్చారా అంటూ ప్రశ్నించింది.

**శని, ఆదివారాల్లోనే ఎందుకు?**
ప్రభుత్వ ఉద్యోగులు అందరికీ ఆదివారం సెలవుదినం.. అలాంటిది సెలవు దినాలలో మీరు ఎందుకు పనిచేస్తున్నారని రంగనాథ్‌ను హైకోర్టు ప్రశ్నించింది. శని, ఆదివారాల్లో అదికూడా సూర్యాస్తమయం తర్వాత కూల్చివేతలు ఎందుకు చేపడుతున్నారని నిలదీసింది. గతంలో వారాంతంలో కూల్చివేతలు చేపట్టవద్దంటూ కోర్టులు తీర్పిచ్చిన విషయం తెలియదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది.

చట్టప్రకారం నడుచుకోకపోతే తర్వాత ఇబ్బంది పడాల్సి వస్తుందని తహసీల్దార్‌ను హెచ్చరించింది. రాజకీయ నేతలు చెప్పారనో, పై అధికారులు ఆదేశించారనో అత్యుత్సాహంతో పనిచేస్తే ఆ తర్వాత ఇబ్బంది పడతారంటూ అధికారులకు వార్నింగ్ ఇచ్చింది.

**అడిగిన ప్రశ్నకు మాత్రమే జవాబివ్వండి..**
ఆదివారం కూల్చివేతలు చేపట్ట వచ్చా అని హైకోర్టు ప్రశ్నించగా.. కూల్చివేతకు యంత్రాలు, సిబ్బంది కావాలని కోరడంతో సమకూర్చామని రంగనాథ్ జవాబు చెప్పారు. దీనిపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అడిగిన ప్రశ్నకు నేరుగా జవాబివ్వాలని హెచ్చరించింది. చార్మినార్ కూల్చివేతకు తహశీల్దార్ యంత్రాలు, సిబ్బంది అడిగితే ఇస్తారా? అని అడిగింది. ఆక్రమణదారులు ఇల్లు ఖాళీ చేయనంతమాత్రాన కూల్చివేతలు చేపట్టడమేంటని ప్రశ్నించింది. ఆదివారం కూల్చివేతలు చేపట్టడం హైకోర్టు తీర్పునకు వ్యతిరేకమని తెలియదా? అంటూ మండిపడింది. చట్ట ప్రకారం నడుచుకోకుంటే ఇంటికి వెళ్తారు జాగ్రత్త.. అంటూ అధికారులను హెచ్చరించింది.

**కూల్చివేతలపై మాత్రమే దృష్టి పెట్టారేం?**
హైడ్రాకు ఉన్న విధుల్లో ఆక్రమణల తొలగింపు కూడా ఒకటని, కేవలం ఇదొక్కటే హైడ్రా డ్యూటీ కాదని హైకోర్టు పేర్కొంది. జీవో ప్రకారం నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే బాధ్యత కూడా హైడ్రాకు ఉందని, మరి దానిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదేమని ప్రశ్నించింది. అమీన్ పూర్ కూల్చివేతలతోపాటు మూసీ విషయంలోనూ 20 లంచ్ మోషన్ పిటిషన్లు దాఖలయ్యాయని హైకోర్టు పేర్కొంది. దీంతో ఇది అరుదైన కేసుగా భావించి అధికారులను విచారణకు పిలిచినట్లు తెలిపింది. నిబంధనలు పాటించకుంటే హైడ్రా ఏర్పాటు జీవోపై స్టే

**ఇవ్వాల్సి వస్తుందని వార్నింగ్ ఇచ్చింది.**
చట్టప్రకారం రిజిస్ట్రేషన్ పూర్తిచేసి, స్థానిక సంస్థల అనుమతి తీసుకున్నాకే ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని కోర్టు గుర్తుచేసింది. అయితే, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపంతో సామాన్యులు నష్టపోవాల్సి వస్తోందని వ్యాఖ్యానించింది. హైడ్రా ఏర్పాటు అభినందనీయం.. కానీ దాని పని తీరుపైనే తమ అభ్యంతరమని కోర్టు పేర్కొంది. ఒక్కరోజులో హైదరాబాద్‌ను మార్చాలనుకోవడం సరికాదని, ఎఫ్ టీఎల్ నిర్ధారించకుండా అక్రమాలను ఎలా తేలుస్తారని నిలదీసింది. అనంతరం కేసు విచారణను ఈ అక్టోబర్ 15 కు వాయిదా వేస్తూ అప్పటి వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది.

# మూసీ సంగతి మాకు తెల్వదు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణ ప్రభుత్వం మూసీ నది సుందరీకరణ పనులు చేపట్టడంలో భాగంగా, పరివాహక ప్రాంతాల వారిని వేరే చోటుకు తరలించాలని నిర్ణయించింది. మూసీ నిర్వాసితుల ఇళ్లను గుర్తించి, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సైతం భావిస్తున్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం మూసీ ప్రాజెక్టు పేరుతో అమాయకుల ఇళ్లను కూల్చివేసి, వారిని రోడ్డుమీదకు లాగుతుందన్న విమర్శలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై రంగనాథ్ కీలక ప్రకటన చేశారు. మూసీ నది పరిధిలో తాము ఎలాంటి కూల్చివేతలు చేపట్టడం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు.

**మూసీ ప్రాంతాల్లో హైడ్రా ఎలాంటి మార్కింగ్ చేయడం లేదు**
మూసీ నదికి ఇరువైపులా సర్వేలతో హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. మూసీ నదిలో ఎలాంటి కూల్చివేతలు హైడ్రా చేపట్టడం లేదని రంగనాథ్ తెలిపారు. మూసీ నది పరివాహక నివాసితులను హైడ్రా అధికారులు ఎక్కడికి తరలించడం లేదని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఇండ్లపై హైడ్రా మార్కింగ్ చేయడం లేదని కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. మూసీ సుందరీకరణ ప్రత్యేక ప్రాజెక్టు అని పేర్కొన్న ఆయన.. మూసీ నది ప్రక్షాళనను మూసీ రివర్‌ంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చేపడుతోందని వివరించారు.



# రుణమాఫీ వివరాలను ప్రజాపోర్టల్‌లో పెట్టాలి

**మొదటిపేజీ తరువాయి**
ప్రతినిధులు నిరసన దీక్ష చేపట్టారు. ఆ పార్టీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే.అరుణ, రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, గోడెం నగేష్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్, ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా, పాల్వాయి హరీష్‌బాబు దీక్షలో కూర్చున్నారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై తీవ్రంగా స్పందించారు. మరోవైపు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ ఈ దీక్షకు సంఘీభావం తెలిపేందుకు రాకపోవడం గమనార్హం. ఇక పార్టీకి సంబంధించిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ముగ్గురు శాసనసభ్యులు గైర్హాజరయ్యారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణారెడ్డి, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ నిరసన దీక్షకు హాజరుకాలేదు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే రుణమాఫీ ఎంత చేశారో ప్రజా పోర్టర్‌లో పెట్టాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. అధికారం పదేళ్లలో బీఆర్ఎస్ ఎంత అపఖ్యాతి మూటకట్టుకుందో పది నెలల్లో కాంగ్రెస్ అంతే మూటకట్టుకుందని ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు బీజేపీ ప్రజాప్రతినిధుల నిరసన దీక్ష కొనసాగనుంది. దీక్షకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ఆ పార్టీ నాయకులు తరలి వచ్చి సంఘీభావం తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ రైతులను నమ్మించి మోసం చేసిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు హైదరాబాద్‌లో సీట్లు రాలేదని, అందుకే ఇక్కడ పేదల ఇళ్లు కూలుస్తోందని ఆరోపించారు. ఆ పార్టీకి అధికారం ఇస్తే నోటీసు లేదని, నేరుగా కూలుస్తున్నారని మండిపడ్డారు. రైతు హామీల సాధన కోసం బీజేపీ ప్రజా ప్రతినిధులు ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద 24 గంటల దీక్ష చేపట్టారు. రేపు ఉదయం పదకొండు గంటల వరకు జరిగే దీక్షను బీజేపీ కర్ణాటక రాష్ట్ర సహ ఇన్చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎంపీ అర్వింద్ మాట్లాడారు. రైతు రుణమాఫీ చేయలేదని, రైతు భరోసా లేదని, బోనస్ ముచ్చట కూడా లేదని దుయ్యబట్టారు. ప్రమాదవశాత్తు పంట నష్టం జరిగితే ఆదుకునే నాథుడే లేదని వ్యాఖ్యానించారు. మహేశ్వర్ రెడ్డి ఎల్పీ నేత అయినప్పటి నుంచి ఎన్నో స్కాములు, అవినీతిని బట్టబయలు చేశారని కొనియాడారు. కేసీఆర్ తెలంగాణను నట్టేట ముంచారని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే దారిలో పోతోందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు అగ్రికల్చర్ పాలసీ కూడా లేదని ఆక్షేపించారు. అందరూ ఇలాగే కలిసి కట్టుగా బలమైన అపోజిషన్‌గా వెళ్తే, వచ్చే ఎన్నికల్లో అధికారం మనదేనని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రంలో ఇదే పరిస్థితి ఉంటే కేసీఆర్కు పట్టిన గతే రేవంత్కు పడుతుందని వ్యాఖ్యానించారు. ఇచ్చిన హామీలు మరిచావా? మరిచిపోయినట్లు నటిస్తున్నావా అని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి రేవంత్ రెడ్డినీ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చాక వెయ్యి మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. రైతులు ఓట్లేస్తే కాంగ్రెస్ గెలిచిందని గుర్తు చేశారు. రైతులకు అండగా తాముంటామని, కాంగ్రెస్ మెడలు వంచుతామని హెచ్చరించారు.

# హైడ్రా టార్గెట్ భూ బకాసురులే



**మొదటిపేజీ తరువాయి**
దారుణంగా అవుతోందన్న మహేశ్కుమార్, గత పదేళ్లలో 1500 చెరువులు కబ్జాకు గురయ్యాయని వెల్లడించారు. ఇందులో ఎక్కువ శాతం బీఆర్ఎస్ నేతలే ఆక్రమించుకున్నారన్న కాంగ్రెస్ నేత, దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఇప్పుడు వారి వైఖరి ఉందని మండిపడ్డారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు అన్యాయం చేస్తున్నామని దుమ్మెత్తి పోస్తున్న గులాబీ నేతలు, అప్పట్లో రైతులకు బేడీలు వేసి తీసుకెళ్లలేదా? అని మహేశ్కుమార్ గౌడ్ ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన అన్ని పార్టీల అజెండాలో ఉందని వివరించారు. దేశంలోనే అత్యంత కలుషితమైనదిగా మూసీనదికి పేరు ఉందని, కేవలం ఇప్పటివరకు నదీ వ్యర్థాలు మాత్రమే తొలగించినట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్ల చట్టాలు తీసుకొచ్చి ఎంత మంది రైతులను పొట్టన పెట్టుకుందో అందరికీ తెలుసని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటు గురించి ఎంపీ అర్వింద్ మాట్లాడాలని డిమాండ్ చేశారు. హైడ్రా టార్గెట్ భూ బకాసురులు మాత్రమేనన్న మహేశ్కుమార్ గౌడ్, దోషుల ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని తేల్చిచెప్పారు. పేదలు నష్టపోతే నష్టపరిహారం ఇస్తామన్న ఆయన, మూసీ పరిసర ప్రాంతాల్లో ఒక్క గుడిసె కూడా తొలగించలేదని తెలిపారు. మూసీ ప్రక్షాళన జరగకపోతే రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు కూడా ప్రమాదం ఉందని, సోషల్ మీడియాలో పెయిడ్ ఆర్టిస్టుల ద్వారా విష ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తప్పుడు వార్తలతో విష ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.. హైదరాబాద్ పర్యావరణం గురించి పెట్టుబడి దారులు అడుగుతున్నారని, మూసీ ప్రక్షాళనతోనే కోట్లాది పెట్టుబడులు వస్తాయని టీపీసీసీ అధ్యక్షుడు తెలిపారు. వందల కోట్ల రూపాయలతో సోషల్ మీడియాతో తిమ్మిని బమ్మి చేపిస్తున్నారని, హైదరాబాద్ అభివృద్ధి అంటే జన్వాడ ఫాం హౌజ్ చుట్టూ ఉన్న అభివృద్దేనా అని మహేశ్కుమార్ నిలదీశారు. ఓల్డ్ సిటీని కేసీఆర్ నిర్లక్ష్యం చేసారని, హైదరాబాద్ అభివృద్ధి అంటే కేటీఆర్, హరీశ్, కవిత ఫాం హౌజ్ చుట్టూ జరిగిన అభివృద్దేనా అంటూ ధ్వజమెత్తారు.

# ఢిల్లీకి ముఖ్యమంత్రి రేవంత్

**మొదటిపేజీ తరువాయి**
నెలలుగా మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది తప్పా..అది వాస్తవ రూపం దాల్చడం లేదు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కేబినెట్ విస్తరణ ఉంటుందని చాలా మంది అనుకున్నారు. కానీ పార్లమెంట్ ఎన్నికలు ముగిసి ఐదు నెలలు అవుతున్నా ..మంత్రి వర్గ విస్తరణ జరుగలేదు. నెలల కొద్ది సమయం గడుస్తున్నా మంత్రివర్గ విస్తరణలో మాత్రం స్పష్టత రావడం లేదు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతి సారి ఇక తమకు మంత్రి పదవి ఖాయం అన్నట్లుగా నేతలు తెగ ఫీలవుతున్నారు. మంత్రి వర్గ విస్తరణకు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందా అన్న సమాచారాన్ని అనుయాయుల ద్వారా తెలుసుకుంటున్నారట. ఇలా రేవంత్ ఢిల్లీ వెళ్లిన ప్రతి సారి మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న నేతల పరిస్థితి ఇలానే ఉంటుందని సమాచారం. సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లడం , మంత్రి పదవి వస్తుందని నేతలు జిల్లాలో హడావుడి చేయడం పరిపాటిగా మారింది తప్పా మంత్రి వర్గ విస్తరణ మాత్రం జరగడం లేదు.

నేతల లాబీయింగ్
ఇటీవల తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ పేరును కాంగ్రెస్ అధిష్టానం అధికారికంగా ప్రకటించారు. దీంతో నేతల్లో మరోసారి ఆశలు చిగురెత్తాయి. పీసీసీ అధ్యక్షుడిని ప్రకటించారంటే త్వరలో కేబినెట్ విస్తరణ కూడా ఉంటుందని నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇక తమకు మంత్రి పదవి ఖాయం అని కలలు కంటున్నారు. ఈ సారి దసరాలోపు కేబినెట్ విస్తరణ ఉంటుందని తాజాగా కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. దీంతో నేతలు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధపడుతున్నారు. దీంతో తమకు అనుకూలంగా ఉన్న వర్గాల ద్వారా ఢిల్లీ పెద్దలతో రాయబారం నడుపుతున్నారట. కేబినెట్ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే అధిష్టానం పెద్దలతో పలు మార్లు సంప్రదింపులు జరిపారు. ఐనా మంత్రివర్గ విస్తరణ జరగకపోవడంపై కాంగ్రెస్ లో తీవ్ర చర్చ జరుగుతుంది.



# పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్

- **రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి**

**కల్వకుర్తి, విశాల భారతి** దేశంలో ఎక్కడా లేని విధంగా పేద మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణ కోసం తెలంగాణలో సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో గానో తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఇటీవల తలకొండపల్లి మండలం రావిచేడు గ్రామానికి చెందిన అంజనమ్మ అనారోగ్యానికి గురయ్యారు. గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 28,500 ల చెక్కును సోమవారం బాధితురాలికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, మున్సిపల్ కో ఆప్షన్ నెంబర్ మనోహర్ రెడ్డి, నాయకులు గిరి నాయక్, డొక్క లింగం, వట్టేపు కిషోర్, రమేష్, సతీష్, సుమన్ నాయక్ తదితరులు ఉన్నారు.




# ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

**కల్వకుర్తి, విశాలభారతి** కల్వకుర్తి పట్టణంలో పి డబ్ల్యూ ఓ, పీ బీ ఎస్ అండర్ మేనేజ్మెంట్ ప్రభుత్వ వృద్ధాశ్రమలో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డే ను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ భాగ్యమ్మ, సూపర్వైజర్లు హాజరై వృద్ధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వృద్ధులకు సిడిపిఓ భాగ్యమ్మ పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరు ప్రేమగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పద్మావతి, లక్ష్మీ, దేవమ్మ, రసీదా, అరుణ, జ్యోతి, అంగన్వాడి టీచర్ అలివేల, నిర్వాహకులు వెంకటయ్య, హోం కోఆర్డినేటర్ పద్మమ్మ, అసిస్టెంట్ హోమ్ కోఆర్డినేటర్ పరమేష్, సిబ్బంది, వృద్ధులు, తదితరులు ఉన్నారు.



# ఎంబిబిఎస్ విద్యార్థికి ఆర్థిక సహాయం

**చింతపల్లి, విశాల భారతి** చింతపల్లి మండల పరిధిలోని తిరుమలాపురం గ్రామానికి చెందిన ముదిగొండ అనిల్ గత సంవత్సరం ఎంబిబిఎస్ లో సీట్ సాధించాడు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబానికి చెందిన ముదిగొండ అనిల్ తల్లిదండ్రులు రాజా దాస్, తల్లి మేరెమ్మలు ఎంబీబీఎస్ లో సీటు సాధించిన విద్యార్థిని చదివించలేమని దిగులుతో ఉండడంతో ఆ నిరుపేద విద్యార్థి విషయాన్నీ తెలుసుకున్న ప్రణవ గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మొదటి సంవత్సరం 50వేల రూపాయలు ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. అదేవిధంగా ద్వితీయ సంవత్సరం కూడా ఆ విద్యార్థికి ఆదివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా ప్రణవ చారిటబుల్ ట్రస్ట్ గ్రూప్ అధినేత పొడుగు రవికుమార్ ముదిగొండ అనిల్ కుమార్ కు మరో 50 వేల రూపాయలను అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రణవ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బూరుగు రవికుమార్, బూరుగు రాంబాబు, మాజీ ఎంపిటిసి బూరుగు ధనమ్మ, గార్లపాటి మల్లయ్య, మాజీ సర్పంచ్ అంగిరేకుల నాగభూషణం, జి.శ్రీనివాస్ రెడ్డి బూరుగు రాజ మల్లయ్య, బూరుగు వీర మల్లయ్య, బూరుగు బాల మల్లయ్య గ్రామ పెద్దలు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ముందస్తు బతుకమ్మ సంబరాలు

**అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీదేవి**

**దేవరుప్పుల విశాల భారతి** దేవరుప్పుల మండలంలోని చిన్నమాడూరు క్లస్టర్ సూపర్ వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్వాడి ఉపాధ్యాయులు అందరూ కలిసి ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ మన సాంప్రదాయాలు పద్ధతులు పిల్లలకు చిన్నప్పటి నుండే అలవర్చుకోవాలని అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల కన్నుల ముందు అంగన్వాడి ఉపాధ్యాయులచే ముందస్తు బతుకమ్మను పేర్చి బతుకమ్మ సంబరాలు నిర్వహించామని అలాగే మన పండగలు వాటి విశిష్టత గురించి చిన్నపిల్లలకు అవగాహన కల్పించడం జరిగిందని సూపర్వైజర్ శ్రీదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమడూరు క్లస్టర్ అంగన్వాడి ఉపాధ్యాయులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# మల్లికార్జున్ తిరిగి మళ్ళీ తొర్రూరు డిపోకు రావడం చాలా సంతోషకరం

**తొర్రూరు,విశాల భారతి:** తొర్రూరు ఆర్టీసి డిపో సన్నూర్ ఎస్ మల్లికార్జున్ ఈ పెరంటే తెలియని వారు ఉండరు గత ఆరునెలల క్రితం ప్రమోషన్ పై మహబూబాబాద్ డిపో కి వెళ్లి ఎట్టకేలకు తిరిగి మళ్ళీ తొర్రూరు డిపో కి రావడం ఆర్టీసీ స్టాఫ్, అతని శ్రేయోభిలాషులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు,తొర్రూరు డిపో ప్రారంభం అయినప్పనుండి ఈ చుట్టుప్రక్కల ఉన్న అన్ని మండల,గ్రామాల వ్యక్తుల తో, ప్రజాప్రతినిధులతో ఎంతగానో మంచి పరిచయం ఉన్న వ్యక్తి గా చెరగని ముద్ర ఉన్న వ్యక్తి ఒక్కమాటలో చెప్పాలంటే ఆర్టీసీ సమ్మె సమయం లో డ్రైవర్స్ కండక్టర్స్ కి తక్కున్న అపారమైన పరిచయస్తులతో చాలా మందికి నెలకు సరిపడ సరుకులు ఇప్పియడం అప్పట్లో



ఎంతో కృషి చేశారని అతను తిరిగి రావడం చాలా సంతోషంగా ఉందని తొర్రూరు డిపో ఆర్టీసీ ఉద్యోగులు వాపోయారు.

# బియ్యం ఇవ్వని రైస్ మిల్లర్లపై కలెక్టర్ అసంతృప్తి...!!

**వనపర్తి, విశాల భారతి::** సి.యం.ఆర్. బియ్యం సేకరణ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో పౌర సరఫరాల శాఖ అధికారులతో సి.యం.ఆర్. రైస్ సేకరణ పై సమీక్ష నిర్వహించారు.గత సమీక్ష సమావేశంలో మిల్లర్ల నుండి రోజువారీగా సేకరించాల్సిన బియ్యం సేకరించేకపోవడం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బియ్యం ఇవ్వని రైస్ మిల్లులలో తనిఖీ చేయాలని ఖరీఫ్ సీజన్ లో ఇచ్చిన వడ్లు వాస్తవంగా ఉన్నాయా లేవా? అనేది తనిఖీ చేసి సరిగ్గా నిల్వలు లేకుంటే కేసులు బుక్ చేయాలని ఆదేశించారు.రైస్ మిల్లుల తనిఖీ రెండు రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని, రైస్ మిల్లర్ల నుండి రైస్ ఇప్పించే బాధ్యత డిప్యూటీ తహసీల్దార్లు తీసుకోవాలని ఆదేశించారు. కాలయాపన చేసిన నిర్లక్ష్యం చేసిన చర్యలు తప్పవని సివిల్ సప్లై డి.టి.లను హెచ్చరించారు.



**అక్టోబర్ 5న వరి కొనుగోలు పై జిల్లా స్థాయి సమావేశానికి ఏర్పాట్లు చేయాలి**

వరి కొనుగోలు పై కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు, లారి ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లకు, వ్యవసాయ విస్తీర్ణాధికారులకు అక్టోబర్ 5 వ తేదీన జిల్లా స్థాయి అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని అందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పి.ఏ.సి.ఎస్, ఐ.కే.పి., మెప్మా, ట్రాన్స్పోర్ట్ తదితర సంబంధిన వారు ఎవరెవరిని, ఎంతమందిని పిలవాలో ప్రణాలిక చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా వరి దొడ్డు రకమా లేదా సన్న రకామా అనేది సాంకేతికంగా తెలుసుకోడానికి కొత్తగా డైల్ మైక్రో యంత్రాన్ని ప్రతి పి.ఏ.సి.ఎస్ కు ఒకటి చొప్పున కొని వాడకం పై శిక్షణ ఇప్పించాలని ఆదేశించారు. ఈసారి సన్న రకం వడ్లకు ప్రభుత్వం తరపున క్వింటాలుకు రూ.500 చొప్పున ప్రోత్సాహకం ఇస్తున్నందున గతంలో కంటే రెండు మూడింతలు అధిక వడ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున దాదాపు 300 వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైన మేరకు గన్ని బ్యాగులు, తమ కొలిచే యంత్రాలు, తూకం వేసే యంత్రాలు, తాలు వేరు చేసేందుకు ఫ్యాన్ లు సమకూర్చుకోవాలని సూచించారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ యం నగేష్, జిల్లా సివిల్ సప్లయి అధికారి కాశి విశ్వనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి స్వరన్ సింగ్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి ప్రసాద్ రావు, జిల్లా తూనికలు కొలతల అధికారి డి. సత్యనారాయణ, డి.పి.యం. అరుణ, డి.యం. ఇర్ఫాన్, సివిల్ సప్లై డి.టి లు తదితరులు పాల్గొన్నారు.




# ఉపాధి హామీ కూలీలకు పనిదినాలు కల్పించేందుకు ప్రణాళిక రూపొందించాలి

**వనపర్తి, విశాల భారతి** ఉపాధి హామీ కూలీలకు 202526 సంవత్సరంలో అత్యధిక పనిదినాలు కల్పించేందుకు పకడ్బందీగా ప్రణాళికలు చేసుకోవాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా పరిషత్, మండల అభివృద్ధి అధికారులు, ఎపీఒలతో సమావేశం నిర్వహించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 202526 సంవత్సరానికి పనుల ఎంపికకు తయారు చేయవలసిన ప్రణాళిక, తయారులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పనుల ఎంపిక గ్రామ సభల నిర్వహణ పై అదనపు కలెక్టర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ఉమాదేవి, జెడ్పి సీఈవో యాదయ్య, అడిషనల్ డి ఆర్ డి ఓ రామ మహేశ్వర్ రెడ్డి, ఎంపీడీవోలు, ఏపీవోలు, ఈవోలు, టిఏలు, మరియు ఎఫ్ఏలు పాల్గొన్నారు.


# ఎసిబి అధికారులకు చిక్కిన పశువైద్యాధికారి

**చింతపల్లి, విశాల భారతి** నల్లగొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన ఇరువురు రైతులు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం స్కీం క్రింద బర్రెల కోసం 10 లక్షల రూపాయల రుణం కింద ఏపీజీవీబీ చింతపల్లి బ్యాంకు నుండి మంజూరయ్యాయి. అయితే బర్రెలకు ఆరోగ్య భీమా కోసం పశువైద్యాధికారి డీజే పాలును ఆ రైతులు కలిశారు. రుణం మంజూరై 15 రోజులు కావస్తున్నప్పటికీ ఫీల్డ్ మీదికి రమ్మని సదరు రైతులు పదే పదే కోరగా ఫీల్డ్ మీదికి వెళ్లి కొనుగోలు చేసిన బర్రెలను పరిశీలించి వాటికి ట్యాగులు కూడా వేశారు. అనంతరం ఆరోగ్య భీమ ధ్రువీకరించడానికి నిరాకరించి 8 000 వేల రూపాయలు డిమాండ్ చేయడం జరిగింది. ఏపీ జీవీబీ అధికారులు రైతులను ఆరోగ్య బీమా గూర్చి కోరగా వెటర్నర్ డాక్టర్ జీజే పాల్ వద్దకు బ్రతిమిలాడి 6వేల రూపాయలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆయన 6000 రూపాయలు ఇస్తామని రైతులు ఒప్పుకున్నప్పటికీ తీసుకోకపోగా రెండు మూడు రోజుల నుండి వాయిదా వేసుకుంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో విసిగిన రైతులు నల్లగొండ ఏసీబీ అధికారులను సంప్రదించారు. సోమవారం రైతుల పేర్లు గోపెయంగా ఉంచి గోప్యంగా ఉంచి ఉమ్మడి నల్గొండ జిల్లా ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర, ఎస్సైలు, వెంకట్రావు, రామారావు తో కలిసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని లంచం డబ్బులు సీజ్ చేసి విచారణ అనంతరం పశు వైద్యాధికారి జీజె పాలను రిమాండ్ కు తరలించనున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.





# లడ్డూ కల్తీకి ఆధారాలేంటి?



- కల్తీ నెయ్యి వాడారో లేదో తెలియకుండా
- సీఎం ఎలా ప్రకటన చేస్తారు?
- ఆ నెయ్యిని ఉపయోగించి చేసిన
- లడ్డూలు ల్యాబ్ కు పంపించారా?
- సిట్ విచారిస్తుంటే మీడియా ప్రకటనలు ఏంటి?
- రాష్ట్ర స్థాయిలో దర్యాప్తు సవ్యంగా జరుగుతుందా?
- కనీసం దేవుడినైనా రాజకీయాలకు దూరంగా ఉంచండి
- సుప్రీంకోర్టు కీలక తీర్పు
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు గట్టి చురకలు

**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:**

తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వివాదంపై సుప్రీం కోర్టులో దాఖలైన నాలుగు పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా లడ్డూ కల్తీ అయిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనకు ఆధారాలు ఏమిటని .. ప్రభుత్వ తరపు లాయర్ సిద్ధార్థ లూథ్రాను ధర్మాసనం ప్రశ్నించింది. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో ప్రకటనల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిందన్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థ లూథ్రా నాలుగు ట్యాంకర్ల కల్తీని నెయ్యిని గుర్తించారని అంతకు ముందు అందే కంపెనీ పంపించిన ట్యాంకర్లను ఉపయోగించారని గుర్తు చేశారు. అయితే ఆ ట్యాంకర్లలో కల్తీ జరిగిందా.. ఆ నెయ్యిని ఉపయోగించి సిద్ధం చేసిన లడ్డూలను టెస్టులకు పంపారా అని ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది.

**కేంద్ర ప్రభుత్వం విచారణ చేపడితే బాగుంటుంది !**

లడ్డూ కల్తీ అంశంపై కేంద్ర ప్రభుత్వం విచారణ జరిపితే బాగుంటుందని ధర్మాసనం అభిప్రాయపడింది. లడ్డూలో కల్తీ నెయ్యి వాడారో లేదో పూర్తిగా తెలియకుండా ముఖ్యమంత్రి ఎలా ప్రకటన చేస్తారని ప్రభుత్వ తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రాను ధర్మాసనం ప్రశ్నించింది. నెయ్యి కల్తీ జరిగిందన్న రిపోర్ట్‌పై సెకండ్ ఒపీనియన్ తీసుకున్నారా లేదా అని ప్రశ్నించారు. కనీసం దేవుడినైనా రాజకీయాల నుంచి దూరంగా పెట్టాలన్నారు.

**సిట్‌ను నియమించిన తర్వాత మీడియాలో ప్రకటన చేయడం ఎందుకు ?**

ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించిన తర్వాత ప్రకటనలు చేశారని ఇక సిట్ సమర్థంగా ఎలా విచారణ జరపగలదని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. ప్రపంచంలో ఉన్న భక్తులందరి మనోభావాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని.. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వేసిన సిట్ ఈ విచారణకు సరిపోతుందా? స్వతంత్ర దర్యాప్తు ఏదైనా అవసరమా అని కేంద్ర సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తిరుమల లడ్డూ వివాదంపై ఇరువైపులా వాదనలు రికార్డు చేసిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణ వచ్చే గురువారానికి వాయిదా వేసింది. గురువారం రోజు సిట్ విచారణ కొనసాగించాలా? లేకపోతే కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించాలా అన్నదానిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. గురువారం కీలక నిర్ణయం వెలువరించే అవకాశం తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గిపోవడంతో నెయ్యి ట్యాంకర్లను టీటీడీ అధికారులు టెస్టులు చేయించారు. అందులో జంతువుల కొవ్వు కలిపినట్లుగా తేలడంతో ఆ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కూటమి నేతల సమావేశంలో ప్రకటించారు.అయితే లడ్డూ కల్తీ జరగలేదని.. దానికి ఆధారాల్లేవని కల్తీ అయిన ట్యాంకర్లను వెనక్కి పంపించారని భక్తుల మనోభావాలు దెబ్బతీశారని.. వైవీ సుబ్బారెడ్డితో పాటు మరో ముగ్గురు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. విచారణ సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరగాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికే సిట్ ను నియమించింది. సిట్ ను కొనసాగించాలా వద్దా అన్నదానిపై గురువారం విచారణలో కీలక నిర్ణయాన్ని సుప్రీంకోర్టు ప్రకటించే అవకాశం ఉంది.



# దసరాకు 6,100 ప్రత్యేక సర్వీసులు

- ఏపీ ఎస్ఆర్టీసీ ప్రకటన
- ఏసీ బస్సుల్లో టికెట్ పై రాయితీ

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

దసరా పండుగ నేపథ్యంలో 6,100 ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర జిల్లాలు, తెలంగాణ, చెన్నై, బెంగళూరు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రకటనలో పేర్కొంది. రద్దీని దృష్టిలో పెట్టుకొని అక్టోబర్ 4 నుంచి 20వ తేదీ వరకు మొత్తంగా 6,100 బస్సులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపింది. దసరాకు ముందు (అక్టోబర్ 4 నుంచి 11 వరకు) 3,040 బస్సులు, దసరా తర్వాత (అక్టోబర్ 12 నుంచి 20 వరకు) మరో 3,060 బస్సులు నడపనున్నట్లు ప్రకటనలో పేర్కొంది. ప్రయాణికులపై ఎలాంటి భారం పడకుండా ఈ ప్రత్యేక సర్వీసుల్లోనూ సాధారణ ఛార్జీలనే వసూలు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ ప్రకటించింది. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు పేర్కొంది. రాను పోను టికెట్ బుకింగ్ చేసుకున్న వారికి టికెట్ ధరలో 10 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొంది. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి మధ్య నడిచే ఏసీ బస్సుల్లోనూ టికెట్ ఛార్జీల పై 10 శాతం రాయితీ అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది.

# పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



- హైకోర్టు అక్రమ కట్టడాలు కూల్చొద్దని చెప్పలేదు
- కూల్చివేతలో నిబంధనలు పాటించాలని చెప్పింది
- మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తున్నాం
- బీజేపీ... రైతుల కోసం దీక్ష చేయడమే ఆశ్చర్యంగా ఉంది
- 10ఏళ్లలో బీజేపీ రైతు కోసం ఏం చేసింది
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**

పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. హైకోర్టు ఎక్కడ అక్రమ కట్టడాలు కూల్చొద్దని చెప్పలేదన్న ఆయన అక్రమ నిర్మాణాల కూల్చివేతలో నిబంధనలు పాటించాలని మాత్రమే హైకోర్టు చెప్పిందని వివరించారు. మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తున్నామన్న ఆయన అక్రమ నిర్మాణాల కూల్చివేత ప్రతి ప్రభుత్వం చేసేదేనని వెల్లడించారు. ఇందిరా పార్కు వద్ద దీక్ష చేస్తున్న బీజేపీ నగరం అంతా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడాన్ని తప్పుబట్టారు. బీజేపీ రైతు దీక్ష చేస్తుందా లేక ప్రచారం చేసుకుంటుందా అని ప్రశ్నించారు. బీజేపీ రైతుల కోసం దీక్ష చేయడమే ఆశ్చర్యంగా ఉందన్నారు. అసలు బీజేపీకి, రైతులకు ఏం సంబంధం ఉందని ప్రశ్నించిన జీవన్ రెడ్డి కాషాయదళం పెట్టుబడిదారుల పార్టీ అని ఆరోపించారు. 10ఏళ్ల నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతు సంక్షేమం కోసం ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయాలన్న ఆలోచన కమలం నేతలకు ఎప్పుడూ చేయలేదని ఆరోపించారు. అంబానీ, అదానీ వంటి పెట్టుబడిదారులకు మాత్రం వేల కోట్లు మాఫీ చేశారని విమర్శించారు. గతంలో కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం రుణమాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం రైతులకు రూ.6 వేలు మాత్రమే ఇస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో సన్నవడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామన్న ఆయన బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా మద్దతు ధరపైన బోనస్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ రెండు సార్లు లక్ష రూపాయల రుణమాఫీ సరిగా చేయలేదని ఆరోపించారు. దీంతో అది కాస్తా వడ్డీ మాఫీ పథకంగా మారిందని ఆరోపించారు. రైతులకు వడ్డీ భారం పడొద్దనే ఒకేసారి రెండు లక్షల రుణమాఫీ చేస్తున్నామన్న ఆయన రూ. 17వేల కోట్లు రుణమాఫీ ఒకేసారి చేయడం సాధారణ విషయం కాదన్నారు. తెలంగాణలో 70శాతం మంది రైతులు రుణ విముక్తులు అయ్యారన్న ఆయన తమ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా రుణమాఫీ కోసం బీజేపీ నేతలు ఢిల్లీలోని వాళ్ల పార్టీ ఆఫీసు ముందు ధర్నా చేయాలని సూచించారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com
జనరల్ న్యూస్
మంగళవారం,
01.10.2024
హైదరాబాద్


# ప్రమాదపు అంచున ఉప్పాక వంతెన

- ఆదమరిస్తే అంతే



**పినపాక, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం మణుగూరు, ఏటూరు నాగారం, ప్రధాన రహదారి పినపాక మండలం పరిధిలోని ఉప్పాక గ్రామం వెళ్లే దారిలో ఉన్నటువంటి వంతెన, గత కొన్ని రోజులుగా వంతెనకి ఇరువైపులా ఉండవలసిన రేలింగ్స్ కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకి భారీ వాహనాలు తగలడంతో రీలింగ్ విరిగిపోవడంతో అస్తవ్యస్తంగా మారింది. అది చూసి చూడనట్టు ఉండటంతో ఎప్పుడు రద్దీగా ఉండే ప్రధాన రహదారి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని వాహనదారులు ఇబ్బందికరంగా మారింది. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేయడంతో వాహనదారులు అప్రమత్తంగా ఉంటారు అని ప్రజలు అంటున్నారు. ఈవంతెనకు కూత వేటు దూరంలో గత కొన్ని రోజులాగా కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై అక్కడ కూడా ప్రమాద గంటికలను మోగిస్తున్నాయి. కావున సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. సంబంధిత అధికారి ఆర్ అండ్ బి ఏ ఈ సురేష్ నీ వివరణ అడగగా గత కొన్ని రోజులుగా కురిసిన వర్షాలకు ఇలా జరిగింది దానికి తగు చర్యలు వీలైనంత త్వరగా తీసుకొని ప్రమాద హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.



# అధికారుల సర్వేపై కలెక్టర్ స్పందించాలి

- పంతంగి వీరస్వామి గౌడ్

**సూర్యాపేట, విశాల భారతి** సూర్యాపేట జిల్లా కేంద్రంలో హైడ్రా పేరుతో అధికారులు చేస్తున్న సర్వేపై జిల్లా కలెక్టర్ స్పందించి ఆందోళనలో ఉన్న ప్రజలకు భరోసానివ్వాలని సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ అధ్యక్షులు, తెలంగాణ జై గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ సామాజిక ఉద్యమకారుడు సావిత్రి భాయ్ పూలే జాతీయ విశిష్ట సేవ అవార్డు గ్రహీత పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హైడ్రా హైదరాబాద్ పరిధి వరకు మాత్రమే ఉంటుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేసినప్పటికీ, సూర్యాపేట జిల్లా కేంద్రంలో అధికారులు సర్వే చేయడం ప్రజలకు ఆందోళన కలిగిస్తుంది అన్నారు. రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి సైతం హైడ్రా కూల్చివేతలు సూర్యాపేటలో ఉండవని ప్రకటించినప్పటికీ ప్రజల్లో భయాందోళనలు తగ్గలేదన్నారు. ఇప్పటికే సూర్యాపేటలో చెరువుల సుందరీ కరణ చేసిన నేపథ్యంలో కూల్చివేతలు ఉండవని రమేష్ రెడ్డి చెప్తున్నప్పటికీ ఓవైపు కొందరిలో ఉపశమనం ఉన్నప్పటికీ మరి కొంతమందిలో భయాందోళన ఉందన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సద్దలచెరువు సమీపంలో ఇటీవల జరిగిన అధికారుల సర్వే విషయంపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్పందించి కూల్చివేతల విషయమై స్పష్టత ఇస్తే ప్రజలు భయాందోళనల నుండి బయట పడే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రకటన చేయాలని కోరారు. ఎంతోమంది నిరుపేదలు 50 ఏళ్ల క్రితం నుండి మున్సిపాలిటీ పర్మిషన్ తీసుకొని నివాసాలు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తూ ఉన్నారని చెప్పారు. అధికారులు సర్వే పేరుతో మార్కింగ్ చేయడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట రియల్ ఎస్టేట్ పట్టణ అధ్యక్షుడు జలగం సత్యం గౌడ్, రియల్ ఎస్టేట్ జిల్లా గౌరవ సలహాదారుడు దేవత్ కిషన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్న శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కోశాధికారి పాల సైదులు, రియల్ ఎస్టేట్ పట్టణ ఉపాధ్యక్షుడు ఖమ్మంపాటి అంజయ్య గౌడ్, సహాయ కార్యదర్శి ఆకుల మారయ్య గౌడ్, సూర్యాపేట పట్టణ గౌరవ సలహాదారుడు మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు సేఫ్టీ కిట్స్



**ఆమనగల్లు, విశాలభారతి :** రాష్ట్ర ప్రభుత్వం తాటి చెట్లు ఎక్కే గీత కార్మికుల కోసం తీసుకువచ్చిన కాటమయ్య రక్షక కవచం సేఫ్టీ కిట్లు రక్షక కవచాలుగా పనిచేస్తాయని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు చెప్పారు. సోమవారం కడ్తాల్ మండలం చరికొండ గ్రామంలో గీతా కార్మికులకు కిట్ల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. తొలి విడతలో 47మందికి సేఫ్టీ కిట్లు మంజూరైనట్లు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ మధ్య చౌహాన్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ క్రిష్ణ ప్రసాద్, బిసి వెల్ఫేర్ డెవలప్మెంట్ ఆఫీసర్ మాధవ రెడ్డి, రవీందర్, స్టేట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, శిక్షకులు పాల్గొన్నారు.



# సూర్యాపేటలో ఎటువంటి కూల్చివేతలు వుండవు

- కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం
- పటేల్ రమేష్ రెడ్డి

**సూర్యాపేట, విశాల భారతి** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఎటువంటి కూల్చివేతలు వుండవని, ప్రజలు భయపడవలసిన అవసరం లేదని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం లోని ఆయన నివాసంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదల ఇళ్లు కూల్చివేత జరగదని అన్నారు. సూర్యాపేటకు హైడ్రాతో సంబంధం లేదని, హైడ్రా కేవలం ఒఆర్ ఆర్ లోపల మాత్రమే పనిచేస్తుందని తెలిపారు. జిల్లాలతో హైడ్రాకు సంబంధం లేదని, సూర్యాపేట లో ఎఫ్టి ఎల్, బఫర్ జోన్ ల సర్వే చేయమని ప్రభుత్వం నుండి ఆదేశాలు లేవని అన్నారు. బిఆర్ ఎస్ నాయకులు కావాలని ప్రజలను తప్పుదోవ పట్టించి, భయానికి గురిచేస్తున్నారని, పేదలు భయపడవలసిన అవసరం లేదని, వారికి కాంగ్రెస్ పార్టీ అండగా వుంటుందని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్ లో వరదలు వచ్చినప్పుడు కాలనీలు మునిగిపోకుండా వుండడానికి హైడ్రా చెరువుల పరిరక్షణ కార్యక్రమం చేపట్టిందని చెప్పారు. సూర్యాపేటలో పేదల ఇళ్ల కూల్చివేతలు వుండవని, సద్దల చెరువు, పుల్లారెడ్డి చెరువు లకు ఇప్పటికే చెరువు కట్టల నిర్మాణం జరిగిందని, చెరువు కట్టల బయట జరిగిన నిర్మాణాలు కూల్చడం జరగదని తెలిపారు. మూసి నది పరివాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోయిన వారికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం డబల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తుందని అన్నారు. సూర్యాపేట ఏరియా ఆసుపత్రిని 1000 పడకల ఆసుపత్రిగా మారుస్తామని, సూర్యాపేట లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, రోడ్ల నిర్మాణం చేస్తామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత సద్దల చెరువు సుందరీకరణ, పార్క్ ల నిర్మాణం కోసం పది కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. ఉర్లుగొండ దేవాలయ అభివృద్ధి కోసం 3 కోట్ల రూపాయలు, పిల్లలమర్రి శివాలయం అభివృద్ధి కోసం రెండున్నర కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో డాక్టర్ రామ్మూర్తి, డి సి సి బి మాజీ డైరెక్టర్ ముదిరెడ్డి రమణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గట్టు శ్రీను, దొంతి రెడ్డి సైదిరెడ్డి, కుంచం అంజయ్య తదితరులు పాల్గొన్నారు.






# విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రామచంద్రాపురంలో నూతన పాఠశాల భవనం ప్రారంభోత్సవం
- పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు
- పాఠశాల నిర్మాణానికి రూ. 40 లక్షల ఎమ్మెల్యే సొంత నిధులు

**పటాన్ చెరు(రామచంద్రాపురం), విశాలభారతి:** విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్ఎన్ కాలనీలో మన ఊరు మనబడి పథకం ద్వారా ఒక కోటి 23 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నిర్మించిన మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవనాన్ని మెదక్ ఎంపీ రఘునందన్ రావుతో కలిసి ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. పాఠశాల నిర్మాణానికి జివిఆర్ ఎంటర్ప్రైజెస్ సిఎస్ఆర్ ద్వారా 40 లక్షల రూపాయలు కేటాయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యేnమాట్లాడుతూ..కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా నియోజకవర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల తీర్చిదిద్దామని తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన పటాన్ చెరులో కేజీ నుండి పీజీ వరకు ప్రభుత్వ భవనాల్లో విద్య రంగాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, అదే స్థాయిలో ఫలితాలు రావాలని కోరారు. ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలలో బాలికలకు స్వీయ రక్షణ పై శిక్షణ అందించాలని కోరారు. దేశ భవిష్యత్తు తరగతి గది నాలుగు గోడల మధ్య నిర్మితమవుతుందన్న స్వామి వివేకానంద సూక్తికి అనుగుణంగా ప్రతి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, పంచాయతీరాజ్ డిఈ సురేష్, మండల విద్యాధికారి రాథోడ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, పరమేష్ యాదవ్, ఐలేష్, సీనియర్ నాయకులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# బైక్ దొంగలు అరెస్ట్

- 23 ద్విచక్ర వాహనాలు దొంగతనం
- మీడియా ముందుకు నిందితులు
- వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** జల్సాలకు, మద్యపానం, ఇతర వ్యసనాలకు అలవాటు పడి డబ్బుల కోసం ద్విచక్ర వాహనాలను చోరీ చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న దొంగల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఏసీపీ కెవిపి రాజు, గ్రీన్ ఫార్మా సిటీ సీఐ ఏ. నరసింహారావు, ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం జోన్ డీసీపీ సునీత రెడ్డి, వివరాలను వెల్లడించారు. తలకొండపల్లి మండలం వెంకట్రావు పేట గ్రామానికి చెందిన దుబ్బ హర్షవర్ధన్, (19) 29వ తేదీన వాహనాల తనిఖీలో పట్టుపడగా గ్రీన్ ఫార్మా సిటీ పోలీస్ స్టేషన్ కు తరలించి పోలీసులు విచారించారు. నందివనపర్తి గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు, మేడిపల్లి గ్రామానికి చెందిన బేత జంగయ్య, (32) జాల నాగరాజు, (24) ముఠాగా ఏర్పడ్డారు. దుబ్బ హర్షవర్ధన్, కు ద్విచక్ర వాహనాల చోరీలో అనుభవం ఉండడంతో అఫ్జల్ గంజ్, మహబూబ్ నగర్, ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల, యాచారం మంచాల ప్రాంతాల్లో బస్టాండ్ రెస్టారెంట్లు ఇతర ప్రాంతాల్లో మాస్టర్ కి తయారు చేసి పార్కింగ్ చేసిన 23 ద్విచక్ర వాహనాలను దొంగలించారు. కొన్ని రైతులకు విక్రయించగా మరికొన్ని వాహనాలు తమ ఇంటి వద్ద దాచిపెట్టినట్లు ఒప్పుకోవడంతో దొంగలించిన మోటార్ సైకిల్లను స్వాధీనం చేసుకొని దొంగలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దొంగలను పట్టుకున్న ఎస్సై తేజం రెడ్డి, కానిస్టేబుళ్లు జె. శ్రీను, హెచ్ సుందరయ్య, హాథిరామ్ నాయక్ , నరేందర్, లకు డీసీపీ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు శంకర్ కుమార్, సత్యనారాయణ, బఖ్య నాయక్, పాల్గొన్నారు.

# నేడు ఇసుక వేలం పాట

**ధర్పల్లి విశాల భారతి :** ధర్పల్లి మండలంలోని దుబ్బాక గ్రామ శివారులో అక్రమంగా నిలువ ఉంచిన సుమారు 55 ట్రాక్టర్ల ఇసుకను నేడు అనగా మంగళవారం తాహసీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్టు తాహసీల్దార్ మాలతి ఒక ప్రకటనలో తెలిపారు. దుబ్బాక గ్రామంలో అక్రమంగా ఇసుక నిలువ ఉంచారనే పోలీస్ అధికారుల సమాచారం మేరకు ఇసుక డంపును పరిశీలించి ముగ్గురు పంచులు, గ్రామపంచాయతీ సెక్రెటరీ సమక్షంలో రెవెన్యూ గిర్దవరి రాజేశ్వర్ పంచనామా నిర్వహించి దానిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని తహసీల్దార్ తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు మంగళవారం ఉదయం 10 గంటల 30 నిమిషాల వరకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.




# ముందస్తు బతుకమ్మ సంబరాలు

**ధర్పల్లి విశాల భారతి:** ధర్పల్లి మండలంలోని శ్రీ మేధా హైస్కూల్లో విద్యార్థులచే పాఠశాల యాజమాన్యం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మదన్ సురేష్ మాట్లాడుతూ.. మన సాంప్రదాయాలు పద్ధతులు విద్యార్థులకు చిన్నప్పటి నుండే అలవర్చుకోవాలని పాఠశాలలో నేడు విద్యార్థులచే ముందస్తు బతుకమ్మను పేర్చి బతుకమ్మ సంబరాలు నిర్వహించామని అలాగే మన పండగలు వాటి విశిష్టత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీమేధ హైస్కూల్ ప్రిన్సిపాల్ జయరెడ్డి, రమాదేవి, శృతి, సోనీ, స్రవంతి, అనీషా, రాసగ్న, జ్యోతి, రిషిక, మౌనిక, కీర్తన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపాల్ ను సన్మానించిన పూర్వ విద్యార్థులు



**మరిపెడ, విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గ మరిపెడ మండలం మున్సిపాలిటీలో టీఎస్ మోడల్ స్కూల్ నందు ఎంతోమంది విద్యార్థులకు మంచి భవిష్యత్తును తీర్చిదిద్ది. బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ ప్రేమ్ కుమార్, అధ్యాపక బృందాన్ని టీఎస్ మోడల్ మోడల్ స్కూల్లో పూర్వ విద్యార్థులు సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రమణి, నాగమోహన్, రవి కుమార్, రమేష్, ఆస్మ , పూర్వ విద్యార్థులు పట్ల వంశీ, గణేష్, సుమన్, తీగల పృథ్వి, సాయి, నరసింహ, నవీన్ ,తరుణ్, ప్రవీణ పాల్గొన్నారు.



# మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- పిడమర్తి రవి

**సూర్యాపేట, విశాల భారతి** తెలంగాణలో జిల్లాల వారిగా వర్గీకరణ చేసి మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు పిడమర్తి రవి అన్నారు. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రాష్ట్ర మాదిగ జేఏసి ఛైర్మన్ పిరమర్తి రవి నాయకత్వంలో చేపట్టిన మాదిగల మేలుకొలుపు యాత్ర మాదిగ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండమీది గోవిందరావు ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ చౌరస్తా కు సోమవారం చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో 1994 లో ఎమ్మార్పీఎస్ డిమాండ్ ప్రకారం మాదిగలకు నష్టం జరుగుతుందని, ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం మాదిగ, మాదిగ ఉపకులాలకు ఏడు శాతం కాకుండా 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో మాల, మాదిగల మధ్య సంఖ్యా బేధం ఉందని జిల్లాల వారిగా వర్గీకరణ చేయాలని 2011 జనాభా లెక్కల ప్రకారం, 2014 సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం కాకుండా, జిల్లాలో సంఖ్యాపరంగా తేడా వస్తే అంతకంటే ఎక్కువ రిజర్వేషన్ కల్పించి వర్గీకరణ చేయాలని కోరారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి మాదిగ వాడ తిరిగి వర్గీకరణ పై చైతన్యం కల్పిస్తామని చెప్పారు. ఈ మాదిగల మేలుకొలుపు యాత్ర సూర్యాపేట నుంచి సోమవారం సాయంత్రం ఖమ్మం, మంగళవారం వరంగల్ కు చేరుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండమీది గోవిందరావు, నాయకులు పిడమర్తి వెంకటయ్య, ఆరె నాగరాజు, మాదిగ జేఏసీ యూత్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ సంజయ్, యువజన రాష్ట్ర నాయకులు బెజవాడ శ్రవణ్, ఎం హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మైసా ఉపేందర్, మీసాల మహేష్, దేవరకొండ నరేష్, నక్క మహేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ గుండ్లపల్లి సుధాకర్, బండారి నరేందర్, పడిదల శంకర్, నెమ్మాది ప్రభు తదితరులు పాల్గొన్నారు.



# పదవీ విరమణ పొందిన ఏఎస్సైలను సత్కరించిన జిల్లా ఎస్పీ

**కొత్తగూడెం, విశాలభారతి:** పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఏఎస్సైలు శ్యామ్ సుందర్ రావు, శ్రీనివాసరావులను సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. చుంచుపల్లి పోలీస్ స్టేషన్ నందు ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న శ్యామ్ సుందర్ రావు మరియు భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావు సోమవారంతో పోలీసు శాఖలో తమ సర్వీస్ ను ముగించుకొని పదవీ విరమణ పొందారు. గత 40 సంవత్సరాలుగా క్రమశిక్షణతో పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించిన ఈ ఇద్దరు అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు.అనంతరం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే తమను సంప్రదించాలని వారికి తెలియజేశారు. పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులు పోలీసు శాఖలో తమ అనుభవాలను ఎస్పీతో పంచుకున్నారు.అనంతరం జిల్లా పోలీసు శాఖలో వారు అందించిన సేవలకు గాను ఎస్పీ వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ నాగరాజు,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు ఏసోబు మరియు తదితరులు పాల్గొన్నారు.



# మార్కెట్ కమిటీల్లో యువతకు అవకాశం కల్పించాలి

- ఎమ్మెల్యేకు యువజన కాంగ్రెస్ నాయకుల విన్నపం

**కల్వకుర్తి, విశాల భారతి** ఆమనగల్, కల్వకుర్తి నూతన మార్కెట్ కమిటీలలో యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం కల్పించాలని కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ తాలూకా అధ్యక్షులు అనిల్ గౌడ్ మాట్లాడుతూ గత పదేళ్లుగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రతిపక్షంలో ఉంటూ అనేక పోరాట కార్యక్రమాలు నిర్వహించామని, పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ పిలుపు కార్యక్రమాలను నిర్వహించడమే గాక అనేక ప్రజా సమస్యలపై పోరాటం నిర్వహించామని, ఎన్నో కేసులు, ఎన్ని ఇబ్బందులు గురిచేసిన పార్టీ జెండా మోసామని గుర్తుచేసారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తను గుర్తిస్తామని వారికి వివిధ స్థాయిలలో స్థానం కల్పిస్తామని తెలియజేశారని గుర్తు చేశారు. కాబట్టి రెండు మార్కెట్ కమిటీలలో ఆయా మండలాల్లో ఉన్నటువంటి యువజన కాంగ్రెస్ నాయకులకు అవకాశం ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ కల్వకుర్తి మండల అధ్యక్షులు బీస బాలరాజు, ఆమనగల్ మండల అధ్యక్షులు రాజశేఖర్, ఆమనగల్ టౌన్ అధ్యక్షులు వస్పుల శ్రీకాంత్, యువజన కాంగ్రెస్ నాయకులు జావేద్, పర్షపాకుల రమేష్, రమేష్ గౌడ్, గొడుగు శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమం కోసం పని చేస్తాం

- **టీయుడబ్ల్యూజే(ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**
- **జర్నలిస్టు ఇండ్ల స్థలాల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం**
- **జర్నలిస్టు ఇండ్ల దరఖాస్తు పత్రాలు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి**



**శేరిలింగంపల్లి,విశాలభారతి:**జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయుడబ్ల్యూజే(ఐ జెయు) పని చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి,రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్ లో సోమవారం టియుడబ్ల్యూజే రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్కింగ్ జర్నలిస్టుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జర్నలిస్టు ఇంటి స్థలాల దరఖాస్తు పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం గత పది సంవత్సరాలుగా యూనియన్ అనేక పోరాటాలు చేసిందని అన్నారు. ప్రస్తుతం ఇండ్ల స్థలాల కోసం చేపడుతున్నటువంటి విలేకరుల వివరాల సేకరణ అనంతరం నియోజకవర్గాల వారీగా లిస్టులను తయారుచేసి మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డికి అందజేస్తామని స్పష్టం చేశారు. ఆయన నుంచి ప్రభుత్వానికి నివేదిక అందజేసేందుకు రాష్ట్ర యూనియన్ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. సంఘాల కతీతంగా నియోజకవర్గంలో పనిచేస్తున్న అర్హులైన వర్కింగ్ జర్నలిస్టుల వివరాలను సేకరించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పినట్లు అసలు ఎవరు కొసరు ఎవరు అనేది తేల్చాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అర్హులైన జర్నలిస్టులను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటి స్థలాలతో పాటు ఆరోగ్య భీమా కల్పన తదితర అంశాలపై పెద్ద ఏత్తున కసరత్తు జరుగుతుందని అన్నారు .త్వరలో జిల్లా కేంద్రంగా రాష్ట్ర స్థాయి పాత్రికేయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి మన సమస్యలు పరిష్కరించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయవలసిన బాధ్యత మన అందరి పైన ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా టియుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షుడు కటకం సుభాష్జి, కోశాధికారి సంరెడ్డి శశి పాల్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, సోలిపురం రజనీకాంత్ రెడ్డి, వర్దెల్లి దశరథ, రచ్చ శేఖర్, శ్యాం ప్రసాద్, జంగయ్య, చెప్పల శ్రీనివాస్, మేకల రవీందర్ రెడ్డి, చెరుకు వెంకట్ స్వామి గౌడ్, మధు, రమేష్, శ్రీనివాసరావు, రాజు, మహేష్, మట్ట అశోక్ గౌడ్, రాజేంద్ర నగర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, సూర్య నారాయణ, ప్రేమ్ ,చందు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.




## సత్యశోధన సమాజ్ స్ఫూర్తితో కులనిర్మూనగై ఉద్యమిద్దాం

**మహబూబాబాద్, విశాలభారతి:** మహాత్మ జ్యోతి రావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152వ, ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె మదార్ పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఎస్కె బాబన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా సహా కార్యదర్శి ఎస్కె మదార్ మాట్లాడుతూ ప్రపంచ దేశంలో లేని కుల వ్యవస్థ కేవలం భారతదేశం లోనే ఉందన్నారు. 77 సంవత్సరాలు అధికార మార్పిడి తరువాత కూడా దేశంలో కుల అనిచివేత అంటరానితనం కుల హత్యలు జరగడం సిగ్గుచేటు అని అన్నారు. కులమని రక్తసి మనసుల మధ్య వైషమ్యలను సృష్టిస్తూ వివక్ష అంటరానితనం హత్యకాండా హత్య చేరాలకు గురి చేస్తుందన్నారు. ఒకపక్క దేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నప్పటికీ మతం పేరుతో మనిషిని మనిషే చంపుతున్న దౌర్భాగ్యపరిస్థితి ప్రస్తుత సమాజం నెలకొంది అన్నారు. కుల వ్యవస్థ క్రీస్తుపూర్వం 3,500 సంవత్సరాల చరిత్ర ఉందని అన్నారు, అది నేడు రాజకీయ నాయకులకు ఓట్లు దండుకునేందుకు ఆయుధమైందన్నారు. దేశంలో లక్షకు పైగా కులాలు ఉప కులాలు ఉన్నాయని మధ్యయుగాల కాలంలోనే కుల వివక్షత వ్యతిరేకంగా వేమన, తుకారం, కబీర్, నానక్ తోపాటు ఎన్నో సంస్కరణోద్యమాలు జరిగాయన్నారు. ప్రస్తుత పాలక బూర్జువా పార్టీలు కుల, మతాల మధ్య తమ చిచ్చుపెట్టి తమ రాజకీయ ప్రయోజనం పొందుతున్నారని, అధికారాన్ని చేదించుకునేందుకు కులాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించుకుంటున్నరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు షర్ఫుద్దీన్ ఉపేందర్, భాస్కర్ రెడ్డి, పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, వెంకన్న, లింగయ్య, యాకయ్య, రాజు, పాపక్క పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభ

**ధర్పల్లి, విశాల భారతి** ధర్పల్లి మండల కేంద్రంలోని హొన్నజీపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సోమవారం చైర్మన్ వెంకంగారి జనార్ధన్ అధ్యక్షతన మహాజన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో గంగా నర్సయ్య ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంకు సంబంధించిన ఆరు నెలల ఆదాయ, వ్యయాలు, ఇతర లావాదేవీలపై నివేదిక చదివి వినిపించారు.ఈ సందర్భంగా సొసైటీ వెంకంగారి జనార్ధన్ మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని సొసైటీ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. గతంలో తీసుకున్న రుణాలకు చెల్లిస్తే కొత్తగా రుణాలు తీసుకునే వారికి అవకాశం ఉంటుందని కావున రైతులు సకాలంలో రుణాలు చెల్లించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్త తీసుకుంటామని, రుణమాఫీ కానీ రైతులందరికీ త్వరలో రుణమాఫీ అయ్యేవిధంగా తీర్మానం చేశామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మామిడి రాములు, కార్యదర్శి బి.గంగా నర్సయ్య, డైరక్టర్లు మైలారం సుభాష్ రెడ్డి, నిరిడి గంగా నరేందర్ బానోత్ పంగి, జనార్ధన్, నరేందర్, బెల్దరి ధర్మేష్,భూమయ్యగారి సాయ రెడ్డి, నిమ్మల మోహన్, సాయిలు, వెల్పూర్ చిన్న గంగారెడ్డి, జమున, కోటల్ పల్లి విజయలక్ష్మి ,మేఘవత్ బిజన్, క్యాషియర్ శ్రీకాంత్, అటెండర్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.



## జోనల్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలెక్షన్ క్రీడల ప్రారంభోత్సవం

- **క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు**
- **ఎమ్మెల్యే శ్రీగణేష్**

**విశాలభారతి,కంటోన్మెంట్:**రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అధిక ప్రాధానత్య ఇస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోయిన్పల్లిలో నిర్వహించిన స్టూడెంట్స్ ఆఫ్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్ స్కూల్స్ , హాస్టల్స్ జోనల్ లెవెల్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలెక్షన్ కార్యక్రమనికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ పోటీలో పాల్గొన విద్యార్థులను మెచ్చుకున్నారు. క్షేత్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిలో క్రీడాల్లో పాల్గొని సత్తాచాటాలని సూచించారు. జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులకు మంచి శిక్షణ పొందారని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడాకారులకు శిక్షణ అందించిన పి.ఈ.టి డ్రిల్ మాస్టార్లను కూడా ప్రశంసించారు.క్రీడాకల్లో రాణించిన వారికి ప్రభుత్వం ప్రత్యేకమైన గుర్తింపు నిస్తుందని వివరించిన ఆయన స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఆటలు అంటే ఆసక్తి అన్ని గుర్తు చేశారు. కామన్ వెల్త్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన నికెత్ జరీన్ కు, ప్రముఖ క్రికెటర్ సిరాజ్ కు గ్రూప్ వన్ పోస్టుతో పాటు 600 గజాల ఇళ్ల స్థలాన్నికూడా కేటాయించారని శ్రీ గణేష్ గుర్తు చేశారు.చిన్నతనం నుంచే క్రీడల్లో రాణిస్తే ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా పొందవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, కాంగ్రెస్ నేత ముప్పిడి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.




## పెండింగ్లోనున్నా పనులు పూర్తి చెయ్యండి

- **జిహెచ్ఎంసి కమిషనర్ కి ఉప్పల్ ఎమ్మెల్యే వినతి**

**నాచారం,విశాలభారతి** జిహెచ్ఎంసి కార్యాలయంలో జిహెచ్ఎంసి కమిషనర్ అమ్రపాలిని ఉప్పల్ ఎంఎల్ఏ మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన అన్ని డివిజన్లలో సీసీ రోడ్డు, జిమ్, కమ్యూనిటీ హాల్ , స్మశాన వాటిక, వివిధ సమస్యల గురించి చర్చించారు. వెంటనే కమిషనర్ అమ్రపాలి పెండింగ్ లో వున్న పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవేందర్ రెడ్డి, ప్రభుదాస్, బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి , బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, గంధం నాగేశ్వర్ రావు, ప్రవీణ్ ముదిరాజ్, నవీన్ గౌడ్, మహేష్ గౌడ్, జంపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ పొందిన ఓయూ పూర్వ విద్యార్థులు

- **డా.ప్రభాకర్, డా.నరేంద్ర కుమార్**



**సికింద్రాబాద్, విశాలభారతి:**హైదరాబాద్ మిర్చి, మామిడి పంటలకు తీవ్ర సమస్యగా మారి పంటనంతా నాశనం చేసి రైతులను ముప్పతిప్పలకు గురి చేస్తున్న నల్ల తామర పురుగు తెగులు నివారణకు ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ) పూర్వ విద్యార్థులు డాక్టర్ గాజుల ప్రభాకర్ (పీహెచ్డీప్లాంట్ సైన్సెస్), డాక్టర్ పాపతోటి నరేంద్రకుమార్ (పీహెచ్డీమైక్రోబయాలజీ) కనిపెట్టిన ఆర్గానిక్ బయోపెస్టిసైడ్ త్రిప్స్ క్లియర్‌ను రైతులకు తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు స్కేలప్ ప్రాజెక్ట్ కింద టీస్పార్క్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ గ్రాంట్ లభించింది. న్యూఢిల్లీలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్ (బీఐఆర్ఏసీ) అందించిన రూ. 50 లక్షల గ్రాంట్‌తో నల్ల తామర పురుగు నివారణ మీద పరిశోధనలు చేసి, అగ్రి హబ్ (AgHub), ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర అగ్రికల్చర్ యూనివర్సిటీ, ఐకెపి నాలెడ్జ్ పార్క్ సాయంతో ఆర్గానిక్ బయోపెస్టిసైడ్ త్రిప్స్ క్లియర్‌ను తయారు చేశారు. త్వరలోనే ఇది రైతులకు అందుబాటులోకి రానుంది.ఈ సందర్భంగా డాక్టర్ గాజుల ప్రభాకర్, డాక్టర్ పాపతోటి నరేంద్రకుమార్ మాట్లాడుతూ. "తెలంగాణ ప్రభుత్వం అందించే గ్రాంట్ కి తమ ప్రాజెక్ట్ ఎంపికవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తున్నాం. ఈ గ్రాంట్ వల్ల మాకు ప్రభుత్వ అండ, ప్రోత్సాహం లభించిందని తద్వారా ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు, రైతులకు తక్కువ ధరకే దీన్ని అందుబాటులోకి తెచ్చేందుకు ఉపయోగపడుతుందని, ఇదే ఉత్సాహంతో మరిన్ని పరిశోధనలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తామని, కెమికల్ పెస్టిసైడ్స్ వాడటం వలన మానవులు అనేక రకాల ఆరోగ్య సమస్యలు, క్యాన్సర్ బారిన పడుతున్నారని, వాటి వల్ల పర్యావరణానికి కూడా నష్టం వాటిల్లుతోందని కెమికల్ పెస్టిసైడ్‌ల వాడకం నిర్మూలించి బయోపెస్టిసైడ్స్ వాడటం వలన పైన పేర్కొన్న ఆరోగ్య సమస్యలను అధిగమించి మెరుగ్గా పనిచేసే ఎకో ఫ్రెండ్లీ ప్రోడక్ట్‌లనే తయారు చేస్తున్నామని అన్నారు. వీరిని పలువురు అభినందించారు, శుభాకాంక్షలు తెలియజేశారు.



## గర్రెపల్లిలో మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు జన్మదిన వేడుకలు

**సైదాపూర్, విశాల భారతి** హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ బాబు జన్మదిన వేడుకలు సైదాపూర్ మండలం గర్రెపల్లి గ్రామంలో ఘనంగా జరిగాయి. సోమవారము గ్రామంలోని శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దోకిడి తిరుపతి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కోసం సతీష్ బాబు ఎనలేని కృషి చేశారని అన్నారు. గర్రెపల్లి కొత్త గ్రామ పంచాయతీ ఏర్పాటు కోసం ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూశారని అలాంటి ప్రజల కలను సతీష్ బాబు నెరవేర్చారని అన్నారు. 20 లక్షల రూపాయల తన సొంత నిధులను ఖర్చుపెట్టి గ్రామంలో నల్లాల బావి నిర్మాణం చేపట్టారన్నారు. గ్రామంలో ఎస్సీ కాలనీ నుండి నల్లాల భావి వరకు సిసి రోడ్డు నిర్మాణానికి కృషి చేశారన్నారు. వీటితో పాటు గ్రామంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేముల బాబు రమేష్,మోకిడి తిరుపతి,తీపిరిసేటి మహేష్, ఎనమల్ల రమేష్, అనిల్, మోకిడి దేవరజ్, మోకిడి పద్మ, స్వరూప, సవిత, దోకిడి నరేష్, తిరుపతి, రవీందర్, శ్రీలత చలూరి ఆనంద్,లక్ష్మి,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ సిబిఆర్ ఎస్టేట్ లో దారుణం

- **తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడిన మరీ మహిళా హత్య..?**



**శేరిలింగంపల్లి,విశాలభారతి:**మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టపగలే ఓ మహిళ దారుణంగా హత్యకు గురైన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యులు, తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్ లోని సిబిఆర్ ఎస్టేట్ లో స్పందన (29)అనే వివాహిత భర్తతో గొడవల కారణంగా ఒంటరిగా నివసిస్తోంది. గత కొన్ని రోజులుగా వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని, ప్రస్తుతం ఆ వివాదం విడాకుల వరకు వెళ్లిందని, విడాకుల కేసు కోర్టులో ఉండగానే సోమవారం ఉదయం 1011గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆమెను దారుణంగా హత్యకు గురైందిని తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.



## ఓయూ హెచ్ సిడిసి ఆధ్వర్యంలో ఉచిత వర్క్ షాప్

- **ముఖ్యఅతిథి డా.రోహిణి రొండ్ల**

**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా విశ్వవిద్యాలయం, హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ (HCDC) మరియు వాణిజ్య విభాగం సంయుక్తంగా పీహెచ్డీ విద్యార్థులకు, ఫ్యాకల్టీ, కోసం రిఫరెన్స్ మేనేజ్మెంట్ సాఫ్ట్వేర్ లో మెండ్ లి , ఎండ్ నోట్ వాడుక " అనే అంశంపై ఉచిత వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమం వాణిజ్య విభాగంలో నిర్వహించగా విశ్వవిద్యాలయంలోని వివిధ కళాశాలల పీహెచ్.డి. పరిశోధకులు, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.ప్రధాన అతిథులుగా ప్రొఫెసర్ సి.వి. రంజని, యచ్ సి డి సి డైరెక్టర్, కోఆర్డినేటర్ డాక్టర్.పి. మురళీధర్ రెడ్డి, వాణిజ్యశాస్త్ర డీన్ ప్రో.చెన్నప్ప, బిఓఎస్ ప్రో. కృష్ణచైతన్య, పాల్గొన్నారు. వర్క్‌షాప్‌కు డాక్టర్ రోహిణి రొండ్ల, విద్యా జ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (VJIT అటానమస్ కాలేజ్) జేఎన్టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్, రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా డా .రోహిణి మాట్లాడుతూ. విద్యార్థులు, ఆచార్యులు తమ పరిశోధన కోసం, ప్రాజెక్టుల కోసం అంతర్జాల పద్ధతిలో విషయ సేకరణ కోసం నెలల సమయాన్ని వృధా కానివ్వకుండా అందుబాటులో వున్న సాఫ్ట్వేర్స్ ఉపయోగించుకొనే నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే అతి సులభంగా వారి వారి లక్ష్యాలను సాధించవచ్చు అన్నారు.ప్రొఫెసర్ సి.వి. రంజని మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమం పరిశోధన నైపుణ్యాలను పెంపొందించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రొఫెసర్ కృష్ణ చైతన్య విద్యార్థుల చురుకైన పాల్గొనడాన్ని ప్రశంసించారు, ప్రొఫెసర్ డి. చెన్నప్ప ఉన్నత పరిశోధన ప్రమాణాలను పాటించాలని సూచించారు.డాక్టర్ మురళీధర్ రెడ్డి వర్క్‌షాప్ ముగింపులో పాల్గొన్నవారిని అభినందిస్తూ, ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను వారి పరిశోధనల్లో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.




## స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో మేయర్ అజయ్

**బోడుప్పల్ ,విశాలభారతి :**బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమం లో పాల్గొన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ వారితో పాటు కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నష్టపరిహారం పంపిణీ

- **చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి**



**పటాన్ చెరు,విశాలభారతి:**పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. జిన్నారం మండలం ఊట్ల గ్రామంలో ఇటీవల కరెంట్ షాక్ తో మృతి చెందిన నల్లా సాయి కుమార్ కుటుంబానికి విద్యుత్ శాఖ తరపున మంజూరైన ఐదు లక్షల రూపాయల నష్ట పరిహారం చెక్కుని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అందచేశారు. అనంతరం గుమ్మడిదల మండలం అన్నారం, జిన్నారం మండలం లక్ష్మీపతిగూడెం గ్రామాల్లో ఇద్దరు రైతులకు చెందిన రెండు బర్రెలు విద్యుత్ షాక్ తో మృతి చెందగా, 40 వేల రూపాయల చొప్పున 80 వేల రూపాయలు నష్ట పరిహారం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ మాజీ చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, విజయ్ భాస్కర్ రెడ్డి, ఆంజనేయులు, షేక్ హుస్సేన్, విద్యుత్ శాఖ ఏడిలు దుర్గాప్రసాద్, శ్రీకాంత్, ఏఈలు రాజు, అనంత్ రెడ్డి, పాల్గొన్నారు.



## మణుగూరు రైల్ సర్వీసులను పునరుద్ధరించండి

- **అత్యధిక ఆదాయాన్ని అందిస్తున్న రైల్వే స్టేషన్గా మణుగూరు**
- **రైల్వే అధికారులు చిన్న చూపు చూడడం విచారకరం**
- **ఏ ఐటియు సి, ఎస్ సి డబ్ల్యూ యు డిమాండ్**

**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు ఏఐటియుసి, ఎస్ సి డబ్ల్యూయు బ్రాంచ్ ఆధ్వర్యంలో మణుగూరు స్టేషన్ మాస్టర్ శ్రీ శుభోద్ ద్వారా సౌత్ రైల్వే జనరల్ మేనేజర్ కి మణుగూరు రైల్వే స్టేషన్ నుండి రద్దు చేసిన రైలు సర్వీసులు అన్నింటిని వెంటనే ప్రారంభించాలని సింగరేణి, విజయవాడ ప్యాసింజర్ ట్రైన్లను మణుగూరు వరకు పొడిగించాలని కోరుతూసోమవారం నాడు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణుగూరు నుండి నడిచే రైలు సర్వీసులను కరోనా కారణంతో రద్దు చేశారని తదుపరి దేశంలో అన్ని సర్వీసులను పునరుద్ధరించారని కానీ మణుగూరు నుండి రైలు సర్వీసులను పునరుద్ధరించలేదని అన్నారు. ప్రస్తుతం నడుస్తున్న మణుగూరు ట్రైన్ నిర్ణీత సమయానికి రైలు ప్రయాణికులు గమ్యస్థానం చేరేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. దీనివలన మహిళలు వృద్ధులు పిల్లలు ఆరోగ్య సమస్యలపై హైదరాబాద్ వెళ్లినవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ కామ్రేడ్ మల్లెల రామ నరసయ్య, ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు. ఆధర్ల సురేందర్, ఆకులపల్లి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.




# దేవర'తో హిస్టరీ క్రియేట్ చేసిన మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్

మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'దేవర'. కొరటాల శివ దర్శకత్వం వహించారు. నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె నిర్మించిన ఈ మూవీ సెప్టెంబర్ 27న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్ అయ్యింది. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటించిన ఈ చిత్రంలో బాలీవుడ్ వెర్సటైల్ స్టార్ సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రలో నటించారు. భారీ అంచనాలతో విడుదలైన 'దేవర' చిత్రం బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున విడుదలైన ఈ చిత్రం తొలి రోజున రూ.172 కోట్ల వసూళ్లను సాధించింది. అదే స్పీడుని కొనసాగిస్తోంది. ఈ వారాంతం ముగిసే వరకు అంటే మూడు రోజుల్లోనే రూ.304 కోట్లు గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించటం విశేషం. ఇప్పటి వరకు వచ్చిన కలెక్షన్స్ చూస్తుంటే 80 శాతం రికవరీ అయ్యింది. తెలుగు రాష్ట్రాల్లో 'దేవర' మూవీ బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాల్లో రూ.87.69 షేర్ కలెక్షన్స్ సాధించింది. అలాగే హిందీలోనూ చక్కటి వసూళ్లు వస్తున్నాయి. నార్త్ బెల్ట్‌లో దేవర సినిమా కలెక్షన్స్ నెమ్మదిగా పెరుగుతూ వస్తున్నాయి. హ్యూజ్ ఎక్స్‌పెక్టేషన్స్‌తో ప్రారంభమైన ఈ సినిమా అదే జోరుని కొనసాగిస్తోంది. నాలుగో రోజు కూడా థియేటర్స్ అన్నీ హౌస్‌ఫుల్ కలెక్షన్స్‌తో కొనసాగుతుండటం విశేషం.



# 'తండేల్' 1000 మంది ఆర్టిస్టులతో స్పెక్టాక్యులర్ శివరాత్రి సాంగ్ షూట్

యువ సామ్రాట్ నాగ చైతన్య మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా మూవీ తండేల్. చందూ మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో లో ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ గ్రాండ్‌గా నిర్మిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ లోని శ్రీకాకుళం జిల్లా డి.మత్స్య లేశం గ్రామంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా రూపొందిస్తున్నారు. నిజమైన సంఘటనలే అయినప్పటికీ, ఇద్దరు ప్రేమికుల మధ్య వారి జీవితాల్లో జరిగిన ఎమోషన్స్, ఇన్సిడెన్స్ చాలా గ్రిప్పింగ్ గా ఫిక్షనల్ స్టోరీ కంటే థ్రిల్లింగ్ గా వుండబోతున్నాయి. శైవ క్షేత్రం దక్షిణ కాశీగా పేరుగాంచిన పురాతన శివాలయం శ్రీకాకుళంలోని శ్రీ ముఖలింగం. ఇక్కడ మహాశివరాత్రి ఉత్సవాల్లో అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. దీని స్ఫూర్తితో, టీమ్ సినిమా కోసం అద్భుతమైన, మునుపెన్నడూ చూడని శివరాత్రి పాటను చిత్రీకరించింది. మ్యాసీవ్ సెట్స్, హై ప్రొడక్షన్ వాల్యూస్ తో అద్భుతమైన శివరాత్రి సాంగ్‌ని గ్రాండ్ గా స్కేల్ లో షూట్ చేశారు. దేవి శ్రీ ప్రసాద్ ఒక టైమ్‌లెస్ క్లాసిక్ సాంగ్ ని కంపోజ్ చేసారు, శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ చేసిన ఈ సాంగ్ లో నాగ చైతన్య, సాయి పల్లవి, వేలాది మంది డ్యాన్సర్‌లతో కలిసి అద్భుతంగా అలరించారు. ఈ శివరాత్రి పాట ఎనర్జిటిక్ పెర్ఫార్మెన్స్ లతో నాగ చైతన్య కెరీర్‌లో మోస్ట్ స్పెషల్ సాంగ్స్ లో ఒకటిగా వుండబోతోంది. ఈ అద్భుతమైన శివరాత్రి పాటను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి టీమ్ అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సాంగ్ షూట్ నుండి రెండు పోస్టర్లను మేకర్స్ విడుదల చేసారు. నాగ చైతన్య, సాయి పల్లవి ఇద్దరూ డ్యాన్సర్లతో పాటు డ్యాన్స్ చేస్తూ సంప్రదాయ దుస్తులలో కనిపించారు. పోస్టర్లు హై ప్రొడక్షన్ వాల్యూస్, గ్రాండ్ స్కేల్ ని ప్రజెంట్ చేశాయి.



# కృతి సనన్ కిల్లర్ లుక్

బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ క్రియేట్ చేసుకున్న అందాల భామ కృతి సనన్. ఈ అమ్మడు ఏడాదికి మూడు, నాలుగు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొస్తోంది. కృతి సనన్ నటించిన 'తేరీ బాతోన్ మే ఐసా ఉల్జా జియా', 'క్రూ' సినిమాలు ఈ ఏడాది థియేటర్స్ లోకి వచ్చాయి. వీటిలో 'క్రూ' సినిమా కమర్షియల్ సక్సెస్ అందుకుంది. ఫీమేల్ ఒరియాంటెడ్ కథాంశంతో ఈ మూవీ ప్రేక్షకుల ముందుకొచ్చి ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే 'దో పత్తి' అనే సినిమా నిర్మాణ దశలో ఉంది. ఈ సినిమాకి కృతి సనన్ ప్రొడ్యూసర్ గా కూడా వ్యవహరిస్తోంది. తెలుగులో సూపర్ స్టార్ మహేష్ బాబుకి జోడీగా '1:నేనొక్కడినే' సినిమాతో కృతి సనన్ నటిగా కెరియర్ స్టార్ట్ చేసింది. అయితే ఈ మూవీ ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. 'హీరోపంతి' మూవీతో అమ్మడు బాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చి అక్కడి నుంచి బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్ లతో స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. కృతి సనన్ ఇన్ స్టాగ్రామ్ లో చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్ గా గ్లామర్ ఫోటోషూట్ లని ఇన్ స్టాగ్రామ్ లో షేర్ చేస్తూ ఉంటుంది. వీటికి లక్షల్లో లైక్స్ వస్తాయి. రెగ్యులర్ గా డిఫరెంట్ అవుట్ ఫిట్ లతో కృతి సనన్ తన ఫాలోవర్స్ కి కలర్ ఫుల్ గా ఎట్రాక్ట్ చేస్తూ ఉంటుంది. నెటిజన్లు కూడా కృతి సనన్ గ్లామర్ ఫోటోలని వీక్షిస్తూ ఉంటారు. వాటిపై తమదైన శైలిలో కామెంట్స్ పెడుతూ కృతి సనన్ అందంపై ప్రశంసలు కురిపిస్తారు. తాజాగా ఈ బ్యూటీ బ్లాక్ కలర్ లాంగ్ ఫ్రాక్ లో అదిరిపోయే స్టన్నింగ్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంది. ఈ ఫోటోలని ఏకంగా 4.43 లక్షల మంది ఇప్పటి వరకు లైక్ చేశారు. జలకన్య తరహాలో శరీరం మొత్తం కప్పేసిన ఈ అవుట్ ఫిట్ కృతి సనన్ అందానికి మరింత వన్నెలు అందిస్తోంది. ఒక్క నిమిషంలో జలకన్య అంటూ ఈ ఫోటోలకి కృతి సనన్ కామెంట్ మెన్షన్ చేసింది. ఫ్యాన్స్ నుంచి కృతి సనన్ అందానికి వావ్ అనే కామెంట్స్ వస్తున్నాయి.

# కన్నప్ప నుంచి బ్రహ్మానందం, సప్తగిరిల ఫస్ట్ లుక్ విడుదల



విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' నుంచి ప్రతీ సోమవారం ఒక అప్డేట్ వస్తూనే ఉందన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఇప్పటి వరకు కన్నప్ప నుంచి రకరకాల పాత్రలు, వాటిని పోషించిన ఆర్టిస్టుల పోస్టర్లతో సందడి చేశారు. ఇక ఇప్పుడు ఈ చిత్రంలో నటించిన బ్రహ్మానందం, సప్తగిరి కార్టెక్టర్లను రివీల్ చేశారు. బ్రహ్మానందం ఈ చిత్రంలో పిలక పాత్రను, సప్తగిరి గిలక పాత్రను పోషించారు. 'చేపకు ఈత, పులికి వేట, కోకిలకి పాట.. నేర్పిన గుగ్గురువులు.. అడవికే పాఠాలు చెప్పడానికి వస్తే..' అంటూ ఈ గురువులిద్దరి పాత్రలను అందరికీ పరిచయం చేశారు. చూస్తుంటే వీరిద్దరి కామెడీ కన్నప్ప చిత్రానికి స్పెషల్ అట్రాక్షన్ కానున్నట్టుగా కనిపిస్తోంది. ఇప్పటి వరకు శరత్ కుమార్, మధుబాల, దేవరాజ్, ముఖేష్ రిషి, మంచు అవ్రామ్, అర్పిత్ రంకా, అక్షయ్ కుమార్, తిన్నడు ఉపయోగించే గుర్రం టిక్కి, మారెమ్మ పాత్రకు సంబంధించిన నటి ఐశ్వర్య లుక్‌ను రిలీజ్ చేసిన సంగతి తెలిసిందే. అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. డిసెంబర్‌లో ఈ సినిమా పాన్ ఇండియా వైడ్‌గా విడుదల కానుంది.



# 'శ్వాగ్' ట్రైలర్ రిలీజ్

కంటెంట్ కింగ్ శ్రీవిష్ణు, ట్యాలెంటెడ్ డైరెక్టర్ హసిత్ గోలి 'రాజ రాజ చోర' బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత యూనిక్ ఎంటర్‌టైనర్ 'శ్వాగ్' తో అలరించడానికి రెడీ అయ్యారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మరో 4 రోజుల్లో సినిమా విడుదలకు సిద్ధమవుతుండగా, మేకర్స్ థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. 1551 నుంచి మగవాడి ప్రయాణం అంటూ ట్రైలర్ ప్రారంభమవుతుంది. స్వాగనిక రాజవంశంలో ప్రతి రాజు మగ వారసుడిని కలిగి ఉండాలని కోరుకుంటాడు. అయితే, 1970ల నుండి ఈ వంశానికి చెందిన యయాతి సాదాసీదా జీవితాన్ని గడుపుతాడు. అతనికి కుమార్తెలు మాత్రమే వుంటారు. మరొక యుగానికి చెందిన భవభూతి, సింగ తన వారసుడిని తెలుసుకుంటాడు. రాజవంశం నిధిని అప్పగించడం అతని బాధ్యత. అయితే, వింజమర రాణి దిన్ని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తుంది. విభిన్న టైమ్‌లైన్‌లలో సెట్ చేయబడిన కథ, జెండర్ గేమ్స్ ని ట్రైలర్ చాలా ఆసక్తికరంగా ప్రజెంట్ చేసింది. దర్శకుడు హసిత్ గోలి ఈ ట్రైలర్ ద్వారా ప్లాట్‌ను క్లారిటీ, ఇన్ సైట్ తో అందించారు. శ్రీవిష్ణు 4 డిఫరెంట్ గెటప్‌లలో అద్భుతమైన నటన కనబరిచారు. భిన్నమైన బాడీ లాంగ్వేజ్, డిక్షన్, గెటప్ లతో అలరించారు. భవభూతి పాత్ర ఎక్స్‌ట్రార్డినరీ గా వుంది.

# జీబ్రా సూపర్ డూపర్ హిట్ అవుతుంది

రాక్ స్టార్ మనోజ్ మంచు




ట్యాలెంటెడ్ హీరో సత్య దేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ మోస్ట్ ఎవైటెడ్ మల్టీస్టారర్ 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్లపై SN రెడ్డి, S పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మిస్తున్నారు. ఇటీవలే రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్ మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈరోజు నేచురల్ స్టార్ నాని ఈ సినిమా టీజర్‌ను లాంచ్ చేశారు. టీజర్ జీబ్రా ప్రపంచంలోకి ఒక గ్లింప్స్ అందిస్తుంది. టీజర్ లో బ్లాక్ హార్స్ గా సత్య దేవ్ ఒక MNCలో పనిచేసే వ్యక్తిగా పరిచమయ్యారు. వైట్ హార్స్ గా ధనంజయ ఫెరోషియస్ క్యారెక్టర్ లో కనిపించారు. సునీల్ ని బ్యాడ్ గాయ్ గా చూపించారు. సత్యరాజ్ వెరీ మ్యాడ్ మ్యాన్. WiFi పాస్‌వర్డ్ చివరి ఎపిసోడ్ నవ్వులని పంచింది. టీజర్ డబ్బు, కార్లు, ఓడలు, విమానాలు, ఆవుతో సహా అనేక రకాల ఎలిమెంట్స్ ని ప్రజెంట్ చేసింది. ఇవన్నీ కథనానికి కీలకంగా వుంటాయి. ఈశ్వర్ కార్తీక్ కథను వినోదాత్మకంగా ఉంచుతూ డార్క్ బ్యాక్ డ్రాప్ ని అద్భుతంగా ప్రజెంట్ చేశారు. సత్యదేవ్, ధనంజయ తమ విభిన్న పాత్రలలో అద్భుతమైన నటనను ప్రదర్శించారు. ప్రియా భవానీ శంకర్, సత్య అక్కల, జెన్నిఫర్ పిసినాటోతో పాటు మిగతా నటీనటులు టీజర్ లో అలరించారు. రవి బస్రూర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ నెరేటివ్ ని ఎంగేజింగ్ గా ఉంచింది. సినిమాటోగ్రాఫర్ సత్య పొన్మార్ అందించిన విజువల్స్ అద్భుతంగా వున్నాయి. ప్రొడక్షన్ వాల్యూస్ అత్యున్నత స్థాయిలో ఉన్నాయి. ఎస్ శ్రీలక్ష్మి రెడ్డి సహ నిర్మాత. మీరాఖ్ డైలాగ్స్ రాస్తుండగా, అనిల్ క్రిష్ ఎడిటర్. మేకర్స్ ముందుగా అనౌన్స్ చేసినట్లుగా, జీబ్రా అక్టోబర్ 31న దీపావళి సందర్భంగా అన్ని దక్షిణ భారతీయ భాషలు, హిందీలో థియేటర్లలోకి వస్తుంది. టీజర్ లాంచ్ ఈవెంట్ కు చీఫ్ గెస్ట్ గా వచ్చిన రాక్ స్టార్ మనోజ్ మంచు మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఎస్ ఎన్ రెడ్డి గారు నాకు మంచి శ్రేయోభిలాషి. అలాంటి మంచి వ్యక్తికి మంచి జరగాలనే కోరుకుంటాం. ఈ సినిమా కోసం భారీగా ఖర్చు చేసి, అందరూ ఎంతలా కష్టపడ్డారో నాకు తెలుసు. నా ఫేవరట్.. తమ్ముడు సత్యదేవ్. తను వండర్ ఫుల్ యాక్టర్. ఫస్ట్ నుంచి తన యాక్టింగ్ కి నేను ఫ్యాన్ ని. టీజర్ అదిరిపోయింది. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను. వెల్ కమ్ ధనంజయ. సత్యరాజ్ గారి క్యారెక్టర్ వేరే లెవల్ వుంది. దర్శకుడు తెలుగు నేర్చుకొని సినిమా చేయడం హ్యాట్సప్. ఆర్ఆర్ చాలా బావుంది. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. సినిమా సూపర్ డూపర్ సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అన్నారు. డైరెక్టర్ ఈశ్వర్ కార్తీక్ మాట్లాడుతూ.. అందరికీ థాంక్ యూ. ఇలాంటి మంచి కంటెంట్ ని నమ్మి ప్రోడ్యుస్ చేసిన నిర్మాతలకు థాంక్. ఆడియన్స్ మంచి కంటెంట్ ని సపోర్ట్ చేస్తారు. ఆ నమ్మకంతోనే ఈ సినిమా చేశాం. మీ సపోర్ట్ కావాలి. మనోజ్ గారికి థాంక్ యూ. ఈ సినిమాలో పని చేసిన అందరూ మంచి హ్యూమన్ బీయింగ్స్' అన్నారు. యాక్టర్ సత్య రాజ్ మాట్లాడుతూ.. మోహన్ బాబు గారు నాకు మంచి స్నేహితులు. మనోజ్ ఈ వేడుకకు రావడం ఆనందంగా వుంది. జీబ్రాలో చాలా పెక్యులర్ క్యారెక్టర్ చేశాను. ఈ క్యారెక్టర్ నేను గతంలో చేసిన పాత్రలకు పూర్తి వైవిధ్యంగా వుంటుంది. సత్యదేవ్, డాలీ, మిగతా నటీనటులంతా చాలా అద్భుతంగా చేశారు. ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. టీం అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్' అన్నారు.

# 'ఐ హేట్ మ్యారేజ్' ప్రారంభం



కంటెంట్ ఈజ్ కింగ్‌గా నమ్ముతూ సినిమాలు తీస్తున్నారు నేటి యువ దర్శకులు. వినూత్నమైక కాన్సెప్ట్‌లతో, వైవిధ్యమైన సినిమాలు తీస్తూ అందరి చేత శభాష్ అనిపించుకుంటున్నారు. ఇప్పుడు ఈ కోవలోనే యువ దర్శకుడు పరమేష్ రేణుకుంట్ల ఓ విభిన్నమైన కాన్సెప్ట్‌తో ఓ చిత్రాన్ని ప్రేక్షకల ముందుకు రాబోతున్నాడు. 'ఐ హేట్ మ్యారేజ్' పేరుతో పరమేష్ రేణుకుంట్ల దర్శకత్వంలో ఆర్య సినిమా పతాకంపై ఎం.దయానంద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. సుగి విజయ్, జుప్పీ భద్ర హీరో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత శ్రీనివాస రాజు క్లాప్ నివ్వగా, ప్రముఖ దర్శకుడు సుకుమార్ అన్నయ్య, రచయిత, నిర్మాత విజయ్‌కుమార్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. చిత్ర సంగీత దర్శకుడు వరికుప్పల యాదగిరి ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నేటి యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకలు నచ్చే భావోద్వేగాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నాం. యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రంలో అన్ని వర్గాల వారికి కావాల్సిన అంశాలు వున్నాయి. ముఖ్యంగా ఈ చిత్రంలో ఎంటర్‌టైన్‌మెంట్ అందరిని కడుపుబ్బ నవ్విస్తుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'సోమవారం నుంచి చిత్రీకరణ ప్రారంభించాం. ఏకధాటిగా డిసెంబర్ వరకు జరగే షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. రొటిన్‌కు భిన్నంగా ఓ కొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్నిప్రేక్షకులకు అందించబోతున్నాం' అన్నారు.


Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.